# జనపదం
JANAPADHAM

హైదరాబాద్ | సోమవారం 28 అక్టోబర్ 2024 | సంచిక: 1 సంపుటి: 140

తెలుగు దినపత్రిక


## గ్రూప్ 1 ప్రశాంతం..



- మగిసిన మెయిన్స్ పరీక్షలు
- ఈ నెల 21 నుంచి 27 వరకు నిర్వహణ..
- చెదురుమదురు తప్పా సవ్యంగా ఎగ్జామ్స్..







# కొండంత రాగం తీసి...

## ....పాట పాడినట్టు..!

**కొండంత రాగం తీసి.. దిక్కుమాలిన పాటపాడినట్టు రేవంత్ సర్కార్ యవ్వారం. జన్వాడలో ఏదో అయినట్టు.., మరేదో జరుగుతున్నట్టు., దానితో దేశానికి ఏదో ఉపద్రవం కలుగబోతున్నదా అన్నట్టు అటు పోలీసులు., వారికి తగ్గట్టు ఇటు మీడియా రోజంతా హడావుడి చేసి నవ్వులపాలయ్యాయి. కేటీఆర్ బామ్మర్ది ఇంట్లో జరుపుకున్న ఓ దావత్ ను 'జీర్ణించుకోలేక' కాంగ్రెస్ సర్కార్ డ్రాగ్స్ అని, దందా అని ఏవేవో పేర్లు పెట్టి అక్కసునంతా వెల్ల'కక్కింది'. కేవలం కేటీఆర్ టార్గెట్ గా జరిగిన పని తప్ప అందులో విషయమేమి లేదని చాటి తన పరువును తానే తీసుకుంది. రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము లేక దొంగదెబ్బ తీయాలని భావించి ఇదంతా చేసిందని అంతా తెలిసేలా చేసి మరిన్ని మరకలంటించుకుంది. గంటగంటకు రిపోర్టులు మారుస్తూ.., మీడియాకు లీకులిస్తూ.., ఇంకా ఏదో బయటపెడతామని బిల్డప్ లు చూపే ప్రయత్నంలో కొండను తవ్వి ఎలుకను పట్టిన మహా అద్భుత కార్యమే తప్ప మరేమీ లేదని స్పష్టంగా రుజువు చేసింది.**

- జన్వాడలో రేవంత్ సర్కార్ అత్యుత్సాహం..
- ఇంట్లో దవాత్ కు రేవ్ పార్టీ అంటూ మరలంటించే యత్నం..
- రోజంతా పోలీసుల హంగామా...
- గంటగంటకు మారిన రిపోర్టులు...
- అత్యుత్సాహం ప్రదర్శించిన మీడియా..
- సాయంత్రానికి ఏమీ లేదని తేల్చిన పోలీసులు..

**జనపదం, బ్యూరో**

ఏదో చేద్దామనుకున్నారో.., లేదంటే నిజంగానే పక్షపాతం లేకుండానే ముందుకెళ్లారోగానీ బొక్క బోర్లపడ్డారు. ప్రతిపక్షాన్ని తొక్కేందుకు అన్ని మార్గాలను వెతుక్కుంటూ ఏ మార్గంలో వెళ్లినా తీవ్ర అవమానాల పాలవుతున్నారు. రేవంత్ సర్కార్ తీరు కేవలం పాలన పక్కన పెట్టి కేసీఆర్ అండ్ ఫ్యామిలీ టార్గెట్ ముందుకెళ్తుందన్న చేదు నిజాన్ని ఒక్కొక్కటిగా ఫెయిల్యూర్ అవుతున్న ఘటనలే రూఢీ చేస్తున్నాయి. హామీలపై ప్రశ్నిస్తున్నందుకు ప్రతీకారమో.., ఆ ప్రభుత్వంలో జరిగిన చర్యకు ప్రతిచర్యోగానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను వదిలేసి రివేంజ్ పాలిటిక్స్ కే పెద్దపీట వేస్తున్నది. అందుకు మచ్చుతునకే గతంలో హైడ్రా కూల్చివేతల పేరుతో చేసిన హడావుడి ప్రధానమైనదైతే.., నేడు రేవ్ పార్టీ పేరుతో విరుచుకుపడిన తీరు అతి ప్రధానమైనది.

**జన్వాడలో రేవంత్ సర్కార్ అత్యుత్సాహం..**

కేటీఆర్ బామ్మర్ది రాజ్ పాకాల ఫామ్ హౌస్ జన్వాడలో రేవంత్ సర్కార్ అతి భారీ ఉత్సాహాని ప్రదర్శించినట్టు రోజంతా ......(తరువాయి 4లో)

## సీసీ ఫుటేజ్ బయటపెట్టాలి

వీకెండ్ పేరిట విచ్చల విడి పార్టీలు..

భాగ్యనగర్ వేదికగా డ్రాగ్స్ కల్చర్ పెరుగుతోంది..

బీజేపీ ఎంపీ రఘునందన్ రావు

## కేసు నీరుగార్చే కుట్ర..

ట్విట్టర్ టిల్లు బామ్మర్ది ఫాంహౌజ్ పార్టీకేసులో అన్నీ తారుమారు..

కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే..

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

## బీఆర్ఎస్ నేతల అరెస్ట్..

- ఓరియన్ విల్లాస్ వద్ద ఉద్రిక్తత
- రాజ్ పాకాల నివాసంలోకి వెళ్లేందుకు పోలీసుల యత్నం
- అడ్డుకునే ప్రయత్నం చేసిన గులాబీ దళం..
- బలవంతంగా స్టేషన్‌కు తరలించిన పోలీసులు..



## జన్వాడ ప్రకంపనలు...

కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఫాం హౌస్ లో పార్టీ

హాజరైన 35 మందిలో 14 మంది మహిళలు

ఒకరు కొకైన్ తీసుకున్నట్టు నిర్ధారణ

భారీగా విదేశీ మద్యం పట్టివేత..?

ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు

పాల్గొన్న అందరూ హైప్రొఫైల్ కుటుంబాలకు చెందిన వారే

స్పందించిన బీజేపీ, కాంగ్రెస్, ఎదురుతిరిగిన బీఆర్ఎస్

ముగ్గురిపై కేసులు నమోదు

రాజ్ సోదరుడు రాజేంద్రప్రసాద్ ఇంట్లో ఎక్సైజ్ పోలీసుల సోదాలు

ప్రతిఘటించిన బీఆర్ఎస్ శ్రేణులు

ప్రతిపక్ష ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే అరెస్ట్... పరారీలో రాజ్ పాకాల

## ప్రభుత్వానిది దుష్ప్రచారం

- ఇంత దిగజారుడు సరికాదు...
- కక్షసాధింపునకు పరాకాష్ట..
- మాజీ మంత్రి హరీష్ రావు..
- రేవ్ పార్టీ ఎపిసోడ్ లో రేవంత్ సర్కార్ పై తీవ్ర ఆగ్రహం..
- రాజకీయాలు దిగజారొద్దని కాంగ్రెస్ కు హితవు..

4



## పోరాటం ఆపే ప్రసక్తే లేదు..

- ప్రజల కోసం ప్రాణాలైనా లెక్క చేయా..
- సమస్యలపై నిలదీస్తూనే ఉంటా..
- రాష్ట్రంలో ఏం జరుగుతోందో జనాలే చూస్తున్నారు..
- ఇంట్లో దావత్ చేసుకునుడు తప్పా..?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్..

4





## సదర్.. యాదవుల ఖదర్

యేటా అధికారికంగా నిర్వహణ.. | హైదరాబాద్ అభివృద్ధిని ఆపడం ఎవరి తరం కాదు | మూసీ పరివాహక ప్రజల ప్రమాణాలు పెంచుతాం | తెలంగాణ సదర్ సమ్మేళనంలో సీఎం రేవంత్ రెడ్డి

జనపదం, బ్యూరో : ఏ శక్తులు అడ్డొచ్చినా నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. మూసీనది పునరుజ్జీవనంతో ఆ పరివాహక ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచబోతున్నట్లు వివరించారు. ఆదివారం హైదరాబాద్ లోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన తెలంగాణ సదర్ సమ్మేళనంలో పాల్గొన్న సీఎం హైదరాబాద్ నగర అభివృద్ధిలో యాదవ సోదరుల పాత్ర కాదనలేనిదన్నారు. మురికి కూపంగా మారిన మూసీకి పునరుజ్జీవంలో భాగస్వాములు కావాలన్నారు. యాదవులు రాజకీయంగా ఎదగాలనే అనిల్ కుమార్ యాదవ్ ను రాజ్యసభకు పంపించామని రాబోయే రోజుల్లో రాజకీయాల్లో యాదవ సోదరులకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. తమ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను యాదవ సోదరులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నగరంలో యాదవ సోదరులు పశు సంపదను పెంచి పోషించారని నాడు మూసీ పరివాహక ప్రాంతాల్లో యాదవ సోదరులు పశుగ్రాసాన్ని పెంచుకునేవారని గుర్తు చేశారు. హైదరాబాద్ నగర అభివృద్ధిలో యాదవ సోదరుల పాత్ర కాదనలేనిదన్నారు. సదర్ అంటే యాదవుల ఖదర్ అన్నారు. నగరంలో సదర్ ఉత్సవాలు నిర్వహించడం రాష్ట్రానికి గర్వకారణమన్న సీఎం ఇక నుంచి ప్రతీ ఏటా సదర్ సమ్మేళనం అధికారికంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సదర్ సమ్మేళనాన్ని ప్రతీ గ్రామానికి తీసుకెళ్లాలని సూచించారు.



## సస్పెన్షన్ ఎత్తివేయాలి

- రాష్ట్ర వ్యాప్తంగా బెటాలియన్ పోలీసులు ఆందోళనలు
- విధులను బహిష్కరించి నిరసన ప్రదర్శనలు
- ఇతర రాష్ట్రాల కంటే ఎక్కువ జీతాలు ఇస్తున్నాం
- డీజీపీ జితేందర్

2

కొండాపూర్ 8వ బెటాలియన్ లో రాష్ట్ర వ్యాప్తంగా సస్పెండ్ చేసిన కానిస్టేబుల్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, కానిస్టేబుల్ సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా క్యాండిల్ ర్యాలీ తీసిన కానిస్టేబుల్ కుటుంబ సభ్యులు, వారి పిల్లలు. ఈ సందర్భంగా కానిస్టేబుళ్ల పిల్లలు వీ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలు చేశారు.

## దీపావళి కానుకగా ఇందిరమ్మ ఇండ్లు



- గృహాల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్న సర్కారు
- ఉరుకుల పరుగులతో అభివృద్ధి చేసుకుందాం
- పదేళ్లు మధిర అభివృద్ధికి నిధులు ఇవ్వని బీఆర్ఎస్ సర్కార్
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

## హండ్రెడ్ డేస్.. అట్టర్ ఫ్లాప్..

- జెట్ స్పీడ్ టూ లో స్పీడ్ గా హైడ్రా..
- మొదట్లో దూకుడు.. ఇప్పుడు స్లో
- రాజకీయ ఒత్తిళ్లు.. జనంలో వ్యతిరేకత
- చిచ్చు పెట్టిన మూసీ.. అందిపుచ్చుకున్న విపక్షాలు
- కూల్చివేతలకు విరామం
- 100 రోజుల ప్రోగ్రెస్ రిపోర్ట్



**జనపదం, హైదరాబాద్ సిటీ**

హైడ్రా.. కొన్ని రోజుల కిందట వరకు కంటిమీద కునుకు లేకుండా చేసిన పేరు ఇది. మొదట్లో హైడ్రా బుల్డోజర్లు వస్తాయనే భయంతో చెరువులు, కుంటల పరిధిలో నిర్మాణాలు చేపట్టిన వారందరికీ భయాన్ని చూపించింది. కానీ, రోజులు గడిచే కొద్ది హైడ్రాలో దూకుడు తగ్గిపోయింది. ప్రభుత్వంపై హైడ్రా రూపంలో వ్యతిరేకత పెరిగింది. ఇదే సమయంలో కోర్టు కూడా అక్షింతలు వేసింది. దీనికితోడు ఒత్తిళ్లు ఎక్కువయ్యాయి. మరోవైపు హైడ్రా తీసుకునే నిర్ణయాలకు ......(తరువాయి 2లో)

## 76 ట్రామా సెంటర్లు..



- కులగణనతో అన్ని వర్గాలకు న్యాయం
- అందోల్ కి 3500 ఇందిరమ్మ ఇళ్లు..
- జోగిపేటకు నర్సింగ్ కళాశాల
- వ్యాపారపరంగా పూర్వ వైభవం తీసుకొస్తా..
- రాష్ట్ర వైద్యా ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా..

2

## హండ్రెడ్ డేస్.. అట్టర్ ఫ్లాప్..

**(మొదటిపేజీ తరువాయి)** ఎక్కడా స్పష్టత లేకుండా పోయింది. ఓసారి కూల్చుతామని.. మరోసారి కూల్చమని ఏదేదో చెప్తూ వస్తుంది. అనుమతులు ఉంటే కూల్చమంటూ తాజాగా ప్రకటించింది. హైడ్రా తెరపైకి వచ్చి 100 రోజులు గడిచాయి. ఈ వంద రోజుల్లో హైడ్రా పూర్తిగా వెనకబడిపోయింది. చెరువులు, నీటి కుంటలు, ఇతర ప్రభుత్వ స్థలాలను ఆక్రమణలు అడ్డుకోవడమే లక్ష్యంగా తెలంగాణలోని రేవంత్ సర్కార్.. హైడ్రాను తీసుకువచ్చి 100 రోజులు దాటింది. 30 ప్రాంతాల్లో 300 అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసింది. 100 రోజుల్లో 120 ఎకరాలను ప్రభుత్వానికి అప్పగించింది.

### ఎన్ కన్వెన్షన్ తో ఒక్కసారిగా హడల్

ప్రముఖ సినీ నటుడు నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ కూల్చివేతతో హైడ్రా పేరు మార్మోగింది. అనంతరం.. అనేక అక్రమ నిర్మాణాలపై హైడ్రా బుల్డోజర్లు దూసుకెళ్లి నేలమట్టం చేయడంతో జనం జేజేలు పలికారు. నెటిజెన్లు ప్రశంసల జల్లు కురిపించారు. దీంతో హైడ్రా చీఫ్ రంగనాథ్ సోషల్ మీడియాలో హీరోగా మారిపోయారు. అయితే.. మూసి ప్రక్షాళన అంశం ప్రారంభం అయిన నాటి నుంచి సీన్ రివర్స్ అయ్యింది. బఫర్, ఎఫ్టీఎల్లో సర్వేకు వెళ్లిన అధికారులను నిర్వాసితులు అడ్డుకోవడం ప్రారంభించారు. మా ఇళ్లు కూల్చొద్దంటూ వారు చేస్తున్న ఆందోళనలకు ప్రతిపక్షాలు మద్దతు ప్రకటించాయి. ఈ క్రమంలో సోషల్ మీడియాలోనూ హైడ్రాపై నెగటివ్ ప్రచారం ప్రారంభమైంది. దీంతో ప్రభుత్వం హైడ్రా స్పీడ్ ను తగ్గించింది. చెరువులు, ఇతర నీటి వనరుల కబ్జాతో నగరంలో చిన్న పాటి వర్షానికే రోడ్లు చెరువులను తలపించడం.. కాలనీల్లోని నీళ్లు రావడం తదితర సమస్యల పరిష్కారానికి రేవంత్ సర్కార్ నడుం బిగించింది. దీనికి అసలు కారణం చెరువులను ఆక్రమించుకుని.. అక్కడ నిర్మాణాలు చేపట్టడమని ప్రభుత్వం గుర్తించింది. దీంతో ఎట్టిపరిస్థితుల్లో అయినా రాష్ట్రంలో ఉన్న ఈ సమస్యను తీర్చాలని రేవంత్ సర్కార్ నిర్ణయించుకుంది. ఇందులో భాగంగానే ప్రభుత్వ ఆస్తులు, చెరువుల పరిరక్షణ కోసం జూలై 19న హైడ్రాను ఏర్పాటు చేసింది. ఈ మేరకు జీవో 99ను తీసుకువచ్చింది. ఆపై జూలై 26 నుంచి కూల్చివేతలను ప్రారంభించింది. కాగా ఇప్పటి వరకు 30 ప్రాంతాల్లో 300అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. ఇందులో భాగంగా 100 రోజుల్లో 120 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించింది. జీహెచ్ఎంసీతో పాటు దాదాపు 27 మున్సిపాలిటీలు, 33 గ్రామాల్లో హైడ్రా దూకుడు ప్రదర్శించింది. కూకట్పల్లి శాంతినగర్లోని నల్లచెరువు బఫర్ జోన్, ఎఫ్టీఎల్ పరిధిలో, కిష్టారెడ్డిపేటలో, పటేల్గూడలో మొత్తం ఈ 3 ప్రాంతాల్లోని 8ఎకరాల విస్తీర్ణంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేసింది. అలాగే అమీన్పూర్లో సైతం హైడ్రా పగలు రాత్రి కూల్చివేతలు చేపట్టింది. దాదాపు17 గంటలపాటు నాన్ స్టాప్ కూల్చివేతలు చేపట్టింది. ఈ కూల్చివేతలో ఒక హాస్పిటల్, రెండు అపార్ట్మెంట్లు కూల్చివేసింది. అలాగే పటేల్ గుడాలో 16 విల్లాలను నేలమట్టం చేసి ప్రభుత్వానికి అప్పగించింది.

### అధికారులు హైడ్రాకు బదిలీ..

జీహెచ్ఎంసీ పరిధిలోని కొంతమంది అధికారులను హైడ్రాకు బదిలీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర పురపాలక శాఖ ఉత్తర్వులు (జీవో-191) జారీ చేసింది. ఇందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాకు ఫుల్ పవర్స్ ఇచ్చేసింది. జీహెచ్ఎంసీ -1955 చట్టంలోని సెక్షన్ 374-B ప్రకారం.. పార్కులు, ప్రభుత్వ ఖాళీ స్థలాలు, చెరువులు, డ్రైన్లు, రోడ్లను పరిరక్షించనున్నారు.

### మూసీ సర్వే సమయంలో హైడ్రాపై విమర్శలు..

మూసీలో సర్వే సమయంలో సామాన్యుల నుంచి రేవంత్ సర్కార్ పై తీవ్ర విమర్శలు వచ్చాయి. తెలియక బఫర్, ఎఫ్టీఎల్ లో స్థలాలు కొన్న అనేక మంది ఆందోళనకు దిగారు. ఏళ్ల క్రితం ఉంచి తాము ఇక్కడే ఉంటున్నామని.. అన్ని అనుమతులతో ఇళ్లను కట్టుకున్నామని వారు కన్నీరుమున్నీరయ్యారు. వీరికి ప్రతిపక్షాలు సైతం మద్దతు ఇచ్చాయి. సోషల్ మీడియాలో ఈ దృశ్యాలు వైరల్ కావడంతో.. ప్రభుత్వానికి ఇబ్బందిగా మారాయి. దీంతో నిర్వాసితులను ఒప్పించిన తర్వాతే ముందుకు వెళ్లాలని ప్రభుత్వం భావించి మూసీ ప్రాంతంలో సర్వేను తాత్కాలికంగా ఆపేసింది. హైడ్రా సైతం కూల్చివేతలకు బ్రేక్ ఇచ్చి.. హైదరాబాద్ లోని చెరువులు, కుంటల సర్వేపై దృష్టి సారించింది. మూడు నెలల తర్వాత మళ్లీ హైడ్రా యాక్షన్ ప్రారంభం అయ్యే అవకాశం ఉంది. అయితే.. మూసీ కూల్చివేతలకు, హైడ్రాకు సంబంధం లేదని ప్రభుత్వం చెబుతోంది. హైడ్రా ఇంత వరకు అక్కడ ఒక్క కూల్చివేత కూడా చేపట్టలేదని ఆ సంస్థ చీఫ్ రంగనాథ్ స్పష్టం చేస్తున్నారు.

### ఇప్పుడేం చేద్దాం..?

ఇదే సమయంలో హైడ్రాపై విమర్శలు పెరిగాయి. అప్పటిదాకా సరైన ఆయుధం లేకుండా ఉన్న విపక్షాలకు హైడ్రా రూపంలో కొంత ఉపశమనం దొరికింది. బీఆర్ఎస్, బీజేపీలు పూర్తిగా ఎదురుదాడి మొదలుపెట్టాయి. బాధితుల వద్దకు పరుగులు పెట్టారు. అంతేకాకుండా హైడ్రా రూపంలో ఏఐసీసీకి కమీషన్లు పంపిస్తున్నారనే విమర్శలను బలంగా పెంచారు. అటు ఏఐసీసీ నుంచి కూడా రేవంత్ టీంపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లుగా కూడా ప్రచారం జరిగింది. ఇలాంటి పరిణామాల నేపథ్యంలో హైడ్రా దూకుడు ఎట్టకేలకు తగ్గిపోయింది. దీంతో రోజుకో ప్రకటనకు పరిమితమవుతున్నది. చెరువులు, కుంటల పరిధిని నిర్మాణాలకు అనుమతులు తీసుకుని ఉంటే కూల్చివేయమంటూ ప్రకటించింది. దీంతో చాలా మంది నిర్మాణదారులకు ఊరట దొరికింది. ఎందుకంటే ఈ నిర్మాణాలకు అనుమతులు ఎప్పుడో తీసుకున్నట్లుగా కాగితాలున్నాయి. వాటితో బ్యాంకు లోన్లు కూడా తీసుకున్నారు. ఈ పరిణామాలతో హైడ్రాకు బ్రేక్ పడినట్లుగా మారింది.

# ఆర్థిక పరిస్థితి ఏమిటో చెప్పండి

- బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పు ఎంత?
- ఈ పది నెలల్లో కాంగ్రెస్ అప్పు ఎంత?
- రాష్ట్రంలో 15 లక్షల ఉజ్వల లబ్ధిదారులు
- చేతివృత్తిదారులకు కేంద్రం నైపుణ్య శిక్షణ
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**జనపదం, హైదరాబాద్ సిటీ:** మూసీ ప్రక్షాళన అంశాలను పక్కన పెట్టి ముందు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏమిటో చెప్పాలని రేవంత్ రెడ్డి సర్కార్ ను కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు చేసే స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం లేదన్నారు. ఇవన్నీ వదిలేసి మూసీ ప్రక్షాళనకు లక్షా యాభై వేల కోట్లు అని ఎగిరెగిరి పడుతున్నారని ఆయన విమర్శించారు. ఈ మేరకు సికింద్రాబాద్ సిక్ విలేజ్ ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్స్ సమ్మిట్ -2024లో కిషన్ రెడ్డి పాల్గొన్నారు. తర్వాత ముషీరాబాద్ నియోజకవర్గం లోయర్ ట్యాంక్ బండ్ దోబిఘాట్ లో కమ్యూనిటీ హాల్ కు శంకుస్థాపన చేశారు. అనంతరం నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో కిషన్ రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులు, ఈ పది నెలల్లో అస్సలు ఎంత? వడ్డీ ఎంత చెల్లించారో చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నూతన అప్పులెంత..?, బీఆర్ఎస్ సంక్షేమ కార్యక్రమాలు ఉన్నాయా..?, ఎన్ని రద్దు చేశారు..? కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల పరిస్థితి ఏంటీ..? అని కిషన్ రెడ్డి నిలదీశారు. 10 నెలల కాంగ్రెస్ పాలనలో జరిగిన ఒప్పందాలు, అప్పులు, ప్రభుత్వ స్థిరాస్తులపైన, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో బీఆర్ఎస్ ఆర్థిక పరిస్థితి భ్రష్టు పట్టించిందని విమర్శించారు. కాళేశ్వరం పేరుతో బీఆర్ఎస్ సర్కార్ దోపిడీ చేస్తే, రేవంత్ రెడ్డి సీఎంగా ఉన్న ఈ పది నెలల కాలంలో రియల్ ఎస్టేట్ కుప్పకూలిందని ఆయన దుయ్యబట్టారు. రిజిస్ట్రేషన్లు నిలిచి పోయాయన్నారు. ఫ్లాట్లు, ప్లాట్లు కొనే పరిస్థితి లేదన్నారు. పరిశ్రమల స్థాపన ఆగిపోయిందన్నారు. కట్టెలపొయ్యి పొగతో పేద అక్కచెల్లెమ్మలు కళ్లలో నీళ్లు రావద్దనే ఉద్దేశ్యంతో ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. ఈ పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా 10 కోట్లమంది పేద మహిళలకు ఉచి తంగా సిలిండర్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. తెలంగాణలో 15 లక్షలకు పైగా మహిళా లబ్దిదారులు ఉన్నారని చెప్పారు. చేతివృత్తులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ సర్కార్ విశ్వకర్మ యోజన పేరుతో చేతివృత్తులను ప్రోత్సహిస్తున్నదని ఆయన తెలిపారు. విశ్వకర్మ యోజన కింద కోట్లాది మంది ప్రజలకు నైపుణ్య శిక్షణ, పరికరాలు, ఆర్థిక సాయం మోడీ ప్రభుత్వం అందిస్తోందన్నారు. చేతివృత్తులు చేసుకునే వర్గాలకు మోడీ సర్కార్ అండగా నిలుస్తుందని అన్నారు. రానున్న రోజుల్లో వేలాది మందికి నైపుణ్య శిక్షణ, పరికరాలను అం దించడంతో పాటు ఆర్థిక సాయం కూడా చేస్తామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు.

# రాజ్ పాకాల కొకైన్ ఇచ్చాడు

- పోలీసుల విచారణలో విజయ్ మద్దూరి
- డ్రగ్స్ శాంపుల్స్ నిరాకరించిన మహిళలు
- డ్రగ్ ఫ్లడ్లర్ల తీగ లాగుతోన్న నార్కొటిక్ పోలీసులు
- రాజ్, విజయ్ డ్రగ్స్ తీసుకుంటారు : పోలీసులు



**జనపదం, బ్యూరో:** జన్వాడ ఫామ్ హౌస్ కేసు దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. రేవ్ పార్టీలో కొకైన్ తీసుకున్న విజయ్ మద్దూరిని విచారించిన మోకిలా పోలీసులకు ఆయన కీలక విషయాలు వెల్లడించారు. రాజ్ పాకాల వద్ద నుంచే తాను కొకైన్ తీసుకొని సేవించినట్లు విజయ్ మద్దూరి అంగీకరించాడు. ఈ కేసులో విజయ్ ఇచ్చిన వాంగ్మూలం కీలకంగా మారింది. అయితే రాజ్ పాకాలకు కొకైన్ ఎలా వచ్చింది.? ఎవరు వద్ద నుంచి వచ్చింది.? ఎవరు విక్రయించారు.ఆ పార్టీలో ఇంకా ఎవరెవరు పాల్గొన్నారని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా తన నూతన ఫామ్హౌస్లో దీపావళి పార్టీ కోసం రాజ్ పాకాల తనను పిలిచాడని మెకిలా పోలీసులకు తెలిపిన విజయ్.. కొకైన్ తీసుకోవాలని రాజ్ పాకాల తనతో చెప్పినట్లు పోలీసులకు తెలిపారు. వీకెండ్లో తరచూ రాజ్ పాకాల పార్టీలు నిర్వహించేవారని. వీకెండ్స్లో రాజ్ పాకాల ,విజయ్ మద్దూరి ఇద్దరు కలిసి డ్రగ్స్ పార్టీలు చేసుకునేవారని మోకిలా పోలీసులు వెల్లడించారు. ఇదీలావుంటే రేవ్ పార్టీలో పాల్గొన్న మహిళలు డ్రగ్స్ శాంపుల్స్ ఇచ్చేందుకు నిరాకరించారని మోకిలా పోలీసులు తెలిపారు. అందుకే కేవలం పురుషుల నుంచి నమూనాలు సేకరించినట్లు వివరించారు. మరోవైపు..పరారీలో ఉన్న ఫాంహౌస్ యజమాని రాజ్ పాకాల పోలీసుల విచారణకు గైర్హాజరయ్యారు. ఆదివారం రెండు చోట్ల విచారణకు హాజరు కావల్సి ఉంది. ఉదయం 10 గంటలకు ఎక్సైజ్ కార్యాలయం, 2గంటలకు మోకిలా పోలీస్ స్టేషన్ కు వెళ్లి పోలీసుల విచారణకు సహకరించాల్సిన ఆయన రెండు చోట్లా డుమ్మా కొట్టారు. మొబైల్ స్విచ్ఛాఫ్ చేసుకున్నారు. అయితే రాజ్ పాకాల కోసం 24 గంటలు చూసి వారెంట్ జారీ చేస్తామని మోకిలా పోలీసులు తెలిపారు. కాగా రాజ్ పాకాల రెండు సాఫ్ట్వేర్ కంపెనీలకు సీఈఓగా ఉన్నారు. ఆయనకు చెందిన మరో ఈటీజీ కంపెనీకి విజయ్ మద్దూరి సీఈఓగా పని చేస్తున్నారు.

### ఫామ్హౌస్ రైడ్లో 40 మంది : కమల్ హాసన్ రెడ్డి

సైబరాబాద్ పోలీసులతో కలిసి ఎక్సైజ్ పోలీసులు ఈనెల 27వ తేదీ తెల్లవారుజామున జాయింట్ ఆపరేషన్ నిర్వహించినట్లు ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ కమల్ హాసన్ రెడ్డి తెలిపారు. రాజ్ పాకాల ఫామ్హౌస్పై రైడ్ చేశామని వివరించారు. ఈ పార్టీలో 40 మంది పాల్గొన్నారని తెలిపారు. వీరిలో 18 మంది మహిళలు ఉన్నారన్నారు. 12 ఇంపోర్టెడ్ బాటిళ్లు, న్యూఢిల్లీ నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ మద్యం బాటిళ్లు, మహారాష్ట్ర నుంచి ఎన్డీపీఎల్ మద్యం బాటిళ్లు, 11 ఆల్ట్రా బీర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ పార్టీని రాజ్ పాకాల నిర్వహించారని అన్నారు. ఎక్సైజ్ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఈ పార్టీ నిర్వహించారని తెలిపారు. పార్టీలో నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ మద్యం సర్వ్ చేశారన్నారు. ఎక్సైజ్ నిబంధనలను ఉల్లంఘించి ఈ రెండు నేరాలకు పాల్పడ్డారన్నారు. చేవెళ్ల ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశామని చెప్పారు. ఈ రెండు నేరాలపై ఎక్సైజ్ యాక్ట్ 34(a), 34(1),,9(1) కింద కేసులను నమోదు చేశామని పేర్కొన్నారు.

# రాష్ట్రంలో 76 ట్రామా సెంటర్లు..

- కులగణనతో అన్ని వర్గాలకు న్యాయం
- అందోల్ కి 3500 ఇందిరమ్మ ఇళ్లు..
- జోగిపేటకు నర్సింగ్ కళాశాల
- వ్యాపారపరంగా పూర్వ వైభవం తీసుకొస్తా ..
- వైద్యా ఆరోగ్య శాఖ మంత్రి సీ.దామోదర రాజనర్సింహా..




**జనపదం, అందోల్:** రాష్ట్ర వ్యాప్తంగా సుమారుగా 76 ట్రామా సెంటర్లను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర వైద్యా ఆరోగ్య శాఖ మంత్రి సీ.దామోదర రాజనర్సింహ తెలిపారు. ఆదివారం జోగిపేటలోని శ్రీరామ ఫంక్షన్ హాల్లో జోగిపేట మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ సురేష్ షెట్కార్, మంత్రి దామోదర్, మార్కెటింగ్ అధికారుల సమక్షంలో పాలకవర్గం సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... ట్రామా సెంటర్ల ద్వారా గాయపడిన వారిని ప్రాణాపాయం నుంచి కాపాడుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. జాతీయ రహదారులపై ప్రమాదవశాత్తు ప్రమాదాలు జరిగినప్పుడు గాయపడిన వారిని కాపాడుకునేందుకు ప్రతి 30 కిలో మీటర్ల దూరంలో ఎమర్జెన్సీ కింద ట్రామా సెంటర్లను ఏర్పాటు చేయబోతున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పార్టీలకు అతీతంగా అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తుందని, దీపావళి పండుగ కానుకగా ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లను ఇంచేందుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన వాగ్దానాలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని ఆయన అన్నారు. ఇళ్లు, జాగాలు లేని నిరుపేదలకు పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికి ఇందిరమ్మ పథకం ద్వారా ఇండ్లను అందజేస్తామని ఆయన తెలిపారు. అందోల్ నియోజకవర్గ వ్యాప్తంగా 38,700 మంది రైతులకు రుణమాఫీ జరిగిందని, మరో 2 వేల మందికి రూ.425 కోట్లు రుణమాఫీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. సింగూరు కాలువకు రూ.168 కోట్లతో సిమెంట్ క్రాంకిట్ లైనింగ్ను ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. సింగూరును పర్యాటక రంగంగా తీర్చిదిద్దుతామని, దీని ద్వారా వందల కుటుంబాలు వ్యాపార పరంగా అభివృద్ధి చెందుతాయన్నారు. జోగిపేటలో 150 పడకల ప్రభుత్వాసుపత్రి, వట్పల్లికి 30 పడకల ప్రభుత్వాసుపత్రి మంజూరైందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థులను గెలుపించుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సురేష్ షెట్కార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, వీరశైవలింగాయత్ రాష్ట్ర అధ్యక్షుడు సంగమేశ్వర్, ప్రముఖ న్యాయవాది, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్ కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్ 1 ప్రశాంతం..

- ముగిసిన మెయిన్స్ పరీక్షలు
- ఈ నెల 21 నుంచి 27 వరకు నిర్వహణ..
- చెదురుముదురు తప్పా సవ్యంగా ఎగ్జామ్స్..



**జనపదం, హైదరాబాద్ సిటీ:** తెలంగాణలో వారం రోజుల పాటు జరిగిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. అక్టోబర్ 21 నుంచి ప్రారంభమైన పరీక్షలు ఆదివారం సాయంత్రం 5గంటలతో పూర్తయ్యాయి. మొత్తం 513 పోస్టులకు గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదలైన విషయం తెలిసిందే. 31,383 మంది అభ్యర్థులు మెయిన్స్కు అర్హత సాధించగా.. వీరిలో అత్యధికులు పరీక్షలకు హాజరయ్యారు. స్పోర్ట్స్ కేటగిరిలో 20 మందిని అదనంగా పరీక్షలకు అనుమతించారు. గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షల నిర్వహణ కోసం హైదరాబాద్ ,రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాల్లో 46 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసింది. గ్రూప్ 1 మెయిన్స్కు అర్హత సాధించిన వారిలో చాలా మంది పరీక్షలకు గైర్హాజరు అయ్యారు. దీంతో ఉద్యోగాల కోసం పోటీ పడే అభ్యర్థుల సంఖ్య తగ్గింది.

### కాపీయింగ్ కలకలం..

ఇక ఈ నెల 25న నిర్వహించిన పేపర్ 4- ఎకానమీ అండ్ డెవలప్మెంట్ పరీక్షలో ఓ మహిళా అభ్యర్థి కాపీయింగ్కు పాల్పడ్డారు. రంగారెడ్డి జిల్లా సీవీఆర్ ఇంజనీరింగ్ కాలేజ్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో పరీక్ష రాసేందుకు వచ్చిన మహబూబ్నగర్ జిల్లా ఖానాపూర్కు చెందిన లక్ష్మి చిట్టీలు తీసుకుని వచ్చి కాపీయింగ్కు పాల్పడేందుకు యత్నించింది. ఇది గుర్తించిన సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఆమెను డిబార్ చేస్తున్నట్టుగా టీజీపీఎస్సీ ప్రకటించింది. 26న పేపర్ -5 రోజున కూడా మరో అభ్యర్థి కాపీయింగ్కు పాల్పడేందుకు యత్నించాడు. నారాయణమ్మ ఇంజనీరింగ్ కాలేజ్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో పరీక్ష రాసేందుకు వచ్చిన ఓ అభ్యర్థిని తనిఖీ చేయగా అతని వద్ద చిట్టీలు కనిపించాయి. దీంతో అతడిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని టీజీపీఎస్సీ తెలిపింది.

### పరీక్షల హాజరు శాతం..

* 21న జనరల్ ఇంగ్లీష్ (క్వాలిఫయింగ్ టెస్ట్) పరీక్షకు 22,744 మంది అభ్య ర్థులు హాజరయ్యారు. హాజరు శాతం 72.4గా ఉంది.
* అక్టోబర్ 22న పేపర్ 1- జనరల్ ఎస్సే పరీక్షకు 21,817 మంది అభ్యర్థులు హాజరయ్యారు. హాజరు శాతం 69.4గా ఉంది.
* 23న పేపర్ 2- హిస్టరీ, కల్చర్ అండ్ జియోగ్రఫీ పరీక్షకు 21,429 మంది అభ్యర్థులు హాజరయ్యారు. హాజరుశాతం 68.2గా ఉంది.
*అక్టోబర్ 24న పేపర్ -3 ఇండియన్ సొసైటీ, కాన్స్టిట్యూషన్ అండ్ గవర్నెన్స్ పరీక్షకు 21,264 మంది అభ్యర్థులు హాజరయ్యారు. హాజరు శాతం 67.7గా నమోదైంది.
*అక్టోబర్ 25న పేపర్ 4- ఎకానమీ అండ్ డెవలప్మెంట్ పరీక్షకు 21,195 మంది అభ్యర్థులు హాజరయ్యారు. హాజరు శాతం 67.4గా నమోదైంది
* అక్టోబర్ 26న పేపర్ 5- సైన్స్ అండ్ టెక్నాలజీ, డేటా ఇంటర్ప్రెటేషన్ పరీక్షకు 21,181 మంది అభ్యర్థులు హాజరయ్యారు. హాజరు శాతం 67.4గా ఉంది.

# రైతుల పాలిట శాపంగా రేవంత్ పాలన

- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ నిప్పులు
- ఎక్స్ వేదికగా తీవ్ర స్థాయిలో ధ్వజం



**జనపదం, హైదరాబాద్ సిటీ:** రైతుల పాలిట రేవంత్ పాలన శాపంగా మారింది బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులను నెత్తిన పెట్టుకొని చూస్తామని చెప్పి తీరా అధికారంలోకి వచ్చిన తరువాత వారి నోట్ల మట్టి కొట్టారని ధ్వజమెత్తారు. కనీసం గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను కూడా అమలు చేయలేని దుర్భర స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఎక్స్ వేదికగా ఆయన ధ్వజమెత్తారు. కాంగ్రెస్ వచ్చి.. మార్పు తెచ్చిందంటే ఏమో అనుకున్నామని కానీ రైతుల చేతుల్లోకి పురుగుల మందు డబ్బా తెచ్చి పెట్టిందని విమర్శించారు. రైతు బంధు రాలేదు.. రుణమాఫీ కాలేదు.. తెలంగాణలో బక్కచిక్కిన రైతు పరిస్థితి ఏమాత్రం బాగోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికంతటికీ కారణం అబద్దాలతో అధికారం చేపట్టిన రేవంత్ సర్కార్ కాదా?'' అంటూ నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డి చేసిన పాపం.. రైతు మహేందర్రెడ్డి పాలిట శాపమైందని కేటీఆర్ మండిపడ్డారు. సంపూర్ణం గా రైతు రుణమాఫీ చేస్తామని దేవుడిపై ఒట్లు వేసినా..రైతులకు తప్పని పాట్లు!! అంటూ ట్వీట్ చేశారు. ''ఎంతమంది రైతుల ఉసురు తీసుకుంటారని ప్రశ్నించా రు. ఇంకెంత మంది రైతుల చేతుల్లో పురుగు ల మంది డబ్బా పెడతారని కేటీఆర్ నిలదీశారు. రైతులకు అభయం ఇచ్చేందుకు వెళ్తే అరెస్టులు చేసేందుకు మంత్రుల ఆదేశాలు.. ఇదేనా ప్రజా ప్రభుత్వమని ప్రశ్నించారు. ఏమైంది మీ రైతు డిక్లరేషన్ రాహుల్ గాంధీ గారు అంటూ ఆయన ట్వీట్ చేశారు.

### తెల్ల బంగారం తెల్లబోతోంది

తెల్లబంగారం తెల్లబోతోందని కేటీఆర్ విమర్శించారు. పత్తి కొనుగోళ్ల తీరుపై ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. బోనస్ దేవుడెరుగు.. మద్దతు ధరకే దిక్కు లేదని ఎద్దేవా చేశారు. దళారుల చేతిలో పత్తి రైతులు చిత్తవుతున్నారని పేర్కొన్నారు. కొర్రీలతో సీసీఐ పత్తి కొనుగోళ్లు నిలిపేసిందని చెప్పారు. రైతు ఆగమవుతుంటే ప్రభుత్వం పత్తా లేదన్నారు. పత్తి కొనుగోళ్ల అంశంలో ప్రభుత్వ చొరవ లేదని వ్యాఖ్యానించారు. రైతు డిక్లరేషన్ బోగస్.. కర్షక ద్రోహి కాంగ్రెస్ అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డిస్ట్రక్షన్, డైవర్షన్తోనే కాంగ్రెస్ ప్రభుత్వం కాలం గడిపేస్తోందని.... ప్రజాసమస్యలను పరిష్కారం చేయడం లేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలులో పూర్తిగా విఫలమయిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రుల్లో మందులు కూడా ఉండటం లేదని పేద ప్రజల్ని నానా ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. వచ్చే నాలుగేళ్లలో ప్రభుత్వానికి ప్రజుల బుద్ధి చెబుతారన్నారు.

### బాణసంచా దుకాణంలో అగ్ని ప్రమాదం

**జనపదం, సిటీబ్యూరో:** హైదరాబాద్ అబిడ్స్ పరిధిలోని బొగ్గులకుంటలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. బాణసంచా దుకాణంలో జరిగిన అగ్ని ప్రమాదంతో భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. పక్కనున్న హోటల్కు మంటలు వ్యాపించడంతో ఆందోళన నెలకొంది. మూడు ఫైరింజన్లతో అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పుతున్నారు. ఇప్పటికే పదికి పైగా వాహనాలు దగ్ధమయ్యాయి. దేవాదాయశాఖ కార్యాలయానికి సమీపంలోనే ఈ ఘటన చోటు చేసుకుంది. భారీ పేలుడు శబ్దాలతో మంటలు ఎగసిపడటంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఓ మహిళకు గాయాలు కాగా ఆమెను చికిత్స నిమిత్తం అంబులెన్సులో ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

# సస్పెన్షన్ ఎత్తివేయాలి..

**జనపదం, క్రైమ్:** ఏక్ పోలీస్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టిన 39 మంది టీజీఎస్పీ కానిస్టేబుళ్ళను సస్పెండ్ చేయడంపై బెటాలియన్ పోలీసులు ప్రభుత్వంపై మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని బెటాలియన్లలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. సస్పెన్షన్ ఎత్తివేసి వెంటనే ఏక్ పోలీస్ విధానం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నల్లగొండలోని 12వ బెటాలియన్లో కానిస్టేబుళ్లు ఆందోళనలు చేయగా, వరంగల్ జిల్లా మామునూరు ఫోర్త్ బెటాలియన్ లో విధు లు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. శ నివారం శాంతియుతంగా ధర్నా చేసిన కానిస్టేబుళ్ళను సస్పెండ్ చేశారని వారు ఆరోపించారు. సస్పెండ్ చేసిన కానిస్టేబుళ్ళను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

- రాష్ట్ర వ్యాప్తంగా బెటాలియన్ పోలీసులు ఆందోళనలు
- విధులను బహిష్కరించి నిరసన ప్రదర్శనలు
- ఇతర రాష్ట్రాల కంటే ఎక్కువ జీతాలు ఇస్తున్నాం
- డీజీపీ జితేందర్



### ఎక్కువ జీతాలు ఇస్తున్నాం

-డీజీపీ జితేందర్

ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో పని చేస్తోన్న బెటాలియన్ కానిస్టేబుళ్లకు ఎక్కువగానే జీతభత్యాలు చెల్లిస్తున్నామని డీజీపీ జితేందర్ అన్నారు. కానిస్టేబుళ్లు రోడ్లు ఎక్కి ఆందోళన చేయడం సరైన పద్ధతి కాదన్నారు. పోలీసుల సంక్షేమం కోసం ఆరోగ్య భద్రత వంటి పథకాలను ప్రభుత్వం ఇపటికే అమలు చేస్తోందని తెలిపారు. పోలీస్ ప్రతిష్టను కాపాడాల్సిన బాధ్యత శాఖలోని ప్రతి ఒక్కరిపైన ఉందన్నారు.
బెటాలియన్ కానిస్టేబుళ్ళ సమస్యలు పరిష్కరిస్తామని సీనియర్ అధికారులుగా హామీ ఇస్తున్నామని డీజీపీ జితేందర్ వెల్లడించారు. దర్బార్ లో పాల్గొని తమ సమస్యలు చెప్పుకోవచ్చని కానిస్టేబుళ్ళకు ఆయన సూచించారు.

# అబద్ధాపు హామీలతో అధికారంలోకి...

### రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

### మాజీ మంత్రి హరీశ్ రావు



**జనపదం, సిద్దిపేట బ్యూరో:** అబద్ధాపు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. సిద్దిపేట క్యాంప్ కార్యాలయంలో ఆదివారం 127 మందికి 28.65 లక్షల రూపాయిల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ మూడుసార్లు రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేశారని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు రైతుబంధు ఇవ్వకుండా మోసం చేస్తోందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉద్యోగులకు ఐదు డీఏలు పెండింగ్లో పెట్టిందన్నారు. కేసీఆర్ హయాంలో వానాకాలం, యాసంగికి రైతు బంధు ఇచ్చారని గుర్తు చేశారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ మూడుసార్లు రైతుబంధు ఇవ్వాలని డిమాండ్ చేసిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుబంధు ఊసే మరిచిందన్నారు. ఆడపడచులకు రెండు బతుకమ్మ చీరలు ఇస్తామని ఒక్కటి కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. కల్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామన్నారని, తులం బంగారం దేవుడెరుగు కల్యాణ లక్ష్మికూడా ఇవ్వట్లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉద్యోగులకు ఐదు డీఏలు పెండింగ్లో పెట్టిందని, నిరుద్యోగ యువతకు ఏడాదిలోపు లక్ష ఉద్యోగాలు ఇస్తామని చుక్కలు చూపుతోందన్నారు. అధికారంలోకి వచ్చి 11 నెలలు కావొస్తుందని, కానీ, 25000 ఉద్యోగాలకు కూడా నోటిఫికేషన్ ఇవ్వలేదన్నారు.పీఆర్సీ ఇస్తామని అది కూడా ఇవ్వలేదని హరీష్ రావు మండిపడ్డారు. పేదోడికి ఇళ్లు ఇవ్వకుండా ఉన్న ఇండ్లను కూడా కూలగొడుతున్నారన్నారు. తెలంగాణ అక్కచెల్లెల్లకు 2500 ఇస్తామని బాండ్ పేపర్ కూడా రాసిచ్చారని కానీ ఆ ఊసేలేదన్నారు. కేసీఆర్ హయాంలో సర్కార్ దవాఖానలో ఆడపిల్ల పుడితే 13వేల రూపాయలు ఇచ్చి, కేసీఆర్ కిట్ ఇచ్చి, తల్లిబిడ్డను క్షేమంగా ఇంటివద్ద దింపే ఏర్పాట్లు చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం 13వేల రూపాయలు ఇవ్వట్లేదని, కిట్ కూడా మాయమైందన్నారు. ఎన్నికల వేళ ప్రజలను మాయమాటలతో నమ్మించి ఓట్లు పడగానే వారి గొంతుకోసే ప్రయత్నాలు చేస్తున్నారని హరీష్ రావు మండిపడ్డారు.

# రియల్ ఎస్టేట్ కోసమే పునరుజ్జీవం

- కేసీఆర్ ఎప్పుడో మూసీ ప్రక్షాళన చేపట్టారు
- ఇప్పుడు కాంగ్రెస్ వాళ్ళు వచ్చి చేసేదేముంది?
- మూసీ పేరుతో దోచుకుంటున్నారు
- మాజీ మంత్రి కేటీఆర్..



**జనపదం, హైదరాబాద్ :** రేవంత్ సర్కార్ చేపడుతున్న మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టులో అంతులేని అవినీతి దాగుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఈ ప్రాజెక్టు పేరుతో సీఎం తన రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని విస్తరించుకోవాలని చూస్తున్నాడని ధ్వజమెత్తారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయంలోనే మూసీ ప్రక్షాళన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. అటువంటప్పుడు మళ్లీ కొత్తగా రేవంత్ సర్కార్ చేసింది ఏముందని ప్రశ్నించారు. మూసీ పేరుతో దోచుకోవాలన్న లక్ష్యం సీఎం రేవంత్ లో కనిపిస్తోందని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుకు నిధులు లేవుగానీ.... మూసీ పునరుజ్జీవనానికి మాత్రం ఎలా నిధులు ఉంటాయని కేటీఆర్ ప్రశ్నించారు. ఆదివారం నగరంలోని నాచారంలో ఎస్టీపీని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి కేటీఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూసీ సుందరీకరణకు తాము వ్యతిరేకం కాదని, లూటిఫికేషన్‌కే వ్యతిరేకమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంటే ఎలా బేషజాలకు వెళ్ళకుండా అభినందిస్తామన్నారు. కానీ రేవంత్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 10 నెలలు కావస్తున్నప్పటికీ ఒక్కటంటే ఒక్కటి కూడా మంచి నిర్ణయం తీసుకున్న దాఖలాలు లేవన్నారు. అందుకనే రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు రేవంత్ సర్కార్ పై తీవ్ర స్థాయిలో అసంతృప్తి, ఆగ్రహంతో ఉన్నారన్నారు. హైదరాబాద్ విశ్వనగరంగా ఎదగడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నదని చెప్పారు. పదేండ్లపాటు ప్రణాళికబద్దంగా ఒక్కో రంగాన్ని సరిదిద్దుకుంటూ వచ్చామన్నారు. ఇంటింటికీ నీళ్లు ఇచ్చే తొలి రాష్ట్రంగా తెలంగాణను మార్చామని తెలిపారు. హైదరాబాద్‌లో తాగునీరు, కరెంటు కష్టాలు లేకుండా చేశామన్నారు. వర్షాలతో వరదలు పోటెత్తకుండా చర్యలు తీసుకున్నామని, కోట్ల రూపాయలతో సిటీలోని నాలాలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీని అభివృద్ధి చేశామని వెల్లడించారు.. మూసీ నీరు శుద్ధి కోసం ఎస్టీపీలు ఏర్పాటు చేశామని ,. ప్రతిరోజు దాదాపు 20 కోట్ల లీటర్ల మురుగు నీటిని శుద్ధి చేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. వందశాతం మూసీ నీటి శుద్ధి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని, మురుగునీటి శుద్ధితో ఆరోగ్య సమస్యలు దూరమవుతాయనే ఉద్దేశతో సుమారు నాలుగు వేల కోట్లతో ఎస్టీపీలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.. బీఆర్ఎస్ హయాంలో కట్టిన ఎస్టీపీలతోనే మురుగునీరు శుద్ధి అవుతు న్నదని, ఎల్బీనగర్‌లో భారతదేశంలోనే అతిపెద్ద ఎస్టీపీని నిర్మించామని, మూసీపై 14 బ్రిడ్జిలు కట్టడానికి ప్రణాళిక రచించామని. మొత్తం రూ.20 వేల కోట్లతో మూసీ అభివృద్ధికి ప్రణాళిక రచించామని వెల్లడించారు. ఇప్పుడు రేవంత్ లక్షన్నర కోట్లతో మూసీ సుందరీకరణ అంటున్నారు.. ఢిల్లీకి మూటలు పంపేందుకు మూసీ మాటున మూటలు వెనకేస్తున్నాడని, ఈ దందాను తప్పకుండా బీఆర్ఎస్ పార్టీ అడ్డుకుంటుందని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.



# మహిళల కోసం ఎంఎస్ఎంఈ పార్కులు

- ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటుకు చర్యలు
- ఐదేళ్లలో మహిళా సంఘాలకు రూ.లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**జనపదం, ఖమ్మం :** రాష్ట్రంలోని మహిళలు ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలదొక్కుకోవడమే లక్ష్యంగా ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన బస్ స్టాప్ షెల్టర్, స్త్రీ టీ స్టాల్, కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన లేడీస్ లాంజ్, ఉద్యోగుల భోజనశాల, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ఉప ముఖ్యమంత్రి ప్రారంభించారు. మహిళా సంఘాల సభ్యులతో ముచ్చటించారు. మహిళా సంఘాలకు ప్రజా ప్రభుత్వం అందిస్తున్న వడ్డీలేని రుణాలు, వడ్డీ లేని రుణాలతో ఎలాంటి వ్యాపారాలు చేస్తున్నారు, లాభసాటిగా నడపడానికి తీసుకోవాల్సిన చర్యలు మొదలగు అంశాలను ఉప ముఖ్యమంత్రి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మహిళలకు వడ్డీ లేని రుణాలు బంద్ చేశారని, ఇందిరమ్మ రాజ్యం రాగానే మహిళలకు మరో సారి వడ్డీ లేని రుణాల కార్యక్రమాన్ని పున: ప్రారంభించామన్నారు. మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం బాగు పడుతుందని ప్రభుత్వం భావించి వడ్డీ లేని రుణాలు అందిస్తూ ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం చేపట్టిందని అన్నారు. ప్రతి శాసనసభ నియోజకవర్గ పరిధిలో మహిళలకు ప్రత్యేకంగా చిన్న, చిన్న పరిశ్రమలు ఏర్పాటుకు ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, స్థలాల ఎంపిక జరుగుతుందని, అక్కడ రోడ్లు, కరెంట్, డ్రైన్ మొదలగు మౌళిక సదుపాయాలు ప్రభుత్వమే కల్పిస్తుందన్నారు. మహిళా సంఘాలు ఉత్పత్తి చేసే పరికరాలకు మార్కెట్ కూడా ప్రభుత్వమే కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాబోయే 5 సంవత్సరాల్లో లక్ష కోట్లు అందిస్తామని దీనికి పూర్తి స్థాయిలో ప్రభుత్వమే వడ్డీ చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సుహాసిని, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, డిఆర్డీవో సన్యాసయ్య, డిఆర్వో ఎం. రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



# సబ్ పోస్ట్ మాస్టర్ చేతివాటం

- నకిలీ పాస్ బుక్స్ తోరూ.30 లక్షలు హాంఫట్
- సెంటినరీ కాలనీ సబ్ పోస్ట్ మాస్టర్ హస్తం
- విచారణ చేపడుతున్న అధికారులు

**జనపదం, పెద్దపల్లి :** పెద్దపెల్లి జిల్లా రామగిరి మండలం బేగంపేట తపాలా శాఖలో డిపాజిట్లు గల్లంతైన ఘటన వెలుగు చూసింది. పోస్ట్ ఆఫీస్ లో సబ్ పోస్ట్ మాస్టర్ గా పని చేస్తున్న హేమ చేతివాటంగా విచారణలో బయటపడగా సెంటినరీ కాలనీ పోస్ట్ ఆఫీస్ లో పనిచేసే మరో సబ్ పోస్ట్ మాస్టర్ నరేంద్ర చారి హస్తం కూడా ఉన్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఇదిలా ఉండగా ఈ ఘటనపై అధికారులు శనివారం పోస్టాఫీస్ కు చేరుకొని విచారణ చేపడుతుండగా ఖాతాదారులు చేరుకొని ఆందోళన చేశారు. దీనితో సబ్ డివిజన్ పోస్టల్ అధికారి మోహన్ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి స్వాధీనం చేసుకున్నారు. సబ్ పోస్ట్ మాస్టర్ హేమను ప్రశ్నించారు. ఖాతాదారులు సమయమనం పాటించాలని గల్లంతైన సొమ్మును రికవరీ చేస్తామని అధికారులు చెప్తున్నారు. కాగా. ఈ నకిలీ పాస్ పుస్తకాలు తయారు చేయడంలో ఎవరెవరి హస్తం ఉందనే విషయాలు బయటకు రావాల్సి ఉంది. అయితే తనకేమీ తెలియదని సబ్ పోస్ట్ మాస్టర్ నరేంద్ర చారే ఇదంతా చేశాడని, తనకు నకిలీ పాస్ పుస్తకాలు పంపిస్తేనే సంతకం చేశానని సబ్ పోస్ట్ మాస్టర్ హేమ చెప్తున్నారు. కొద్ది రోజులు గడువు ఇస్తే ఆ సొమ్మును ఖాతాదారుల ఖాతాల్లో జమ చేస్తానని మరోసారి చెప్పడం గమనార్హం. పోస్ట్ మాస్టర్ హేమ చేతివాటం వల్లనే ఇదంతా జరిగిందని విచారణలో వెల్లడైనట్టు అధికారి మోహన్ తెలిపారు. ఇదిలా ఉండగా సెంటినరీ కాలనీ, బేగంపేట, పోస్ట్ ఆఫీస్ లలో ఇంకా డిపాజిట్లు గల్లంతై ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# భౌద్ధ ధర్మంతోనే సమాజ రుగ్మతలు దూరం

- పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- మహాబోధి బుద్ధ విహార్ లో కటిన చీవర దానోత్సవానికి హాజరు



**జనపదం, సికింద్రాబాద్ :** సమాజం రుగ్మతలకు గౌతమ బుద్ధుడి బోధనలు ఒకటే శరణ్యమని, ఆయన బోధనలను ఆచరించడం ద్వారా మానవ జీవితానికి పరిపూర్ణత సిద్ధిస్తుందని పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కఠిన చీవర దానోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని సికింద్రాబాద్‌లోని మహాబోధి బుద్ధ విహార్‌ను ఆదివారం ఆయన సందర్శించి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. మహా బోధి దయక మండలి, మహా బోధి బుద్ధ విహార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కఠిన చీవర దానోత్సవంలో పాల్గొన్న మంత్రి ప్రాచీన బౌద్ధ సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం వర్షావాసం ముగించిన బౌద్ధ భిక్షువులకు వస్త్రాలను దానం చేశారు. అంతకుముందు మంత్రి జూపల్లిని బౌద్ధ భిక్షువులు ఆశీర్వదించారు. అనం తరం డాక్టర్ శివనాగిరెడ్డి పాళీ భాష నుంచి తెలుగులోకి అనువాదించిన బుద్ధ వంశం అనే గ్రంథాన్ని మంత్రి ఆవిష్కరించారు. బుద్ధిస్ట్ సాంస్కృతిక, వా రసత్వ ఉత్సవాలు, త్రిపీటిక పఠన వేడుకలు, త్రిపీటికలను తెలుగులో అనువదించడానికి ఆర్థిక సహాయం చేయాలని మహాబోధి బుద్ధ విహార్ భిక్షు వులు మంత్రిని కోరగా వెంటనే స్పందించిన ఆయన రూ. 4 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. మహా బోధి సొసైటీ, లైట్ ఆఫ్ బుద్ధధర్మ ఫౌండేషన్ ఇంటర్నేషనల్ ఇండియా సంయుక్తంగా బుద్ధిస్ట్ సాంస్కృతిక, వారసత్వ ఉత్సవాలు నిర్వహించనున్నాయి. వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 6 నుంచి 8వ తేదీ వరకు నాగర్జున సాగర్ లోని బుద్ధవనం, హైదరాబాద్ లో జరిగే ఈ వేడుకలకు వివిధ దేశాల బౌద్ధ భిక్షవులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. గౌతమ బు ద్ధుని జ్ఞానమార్గం నేటి సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. బుద్ధుడు చూపిన మార్గాన్ని అనుసరించడం ద్వారా మనం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకోవడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా విలసిల్లిన నాటి బౌద్ధారామాలను పునరుజ్జీవింపచేస్తూ తెలంగాణ కేంద్రంగా బుద్ధుని బోధనలను ప్రపంచానికి అందించాలనే దృఢ సంకల్పంతో, కార్యాచరణతో సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం ముందుకుసాగుతుందని వెల్లడించారు. వీటితోపాటు, బౌద్ధ సంస్కృతి, వారసత్వ పరిరక్షణకు అంకితమైన మహాబోధి బుద్ధ విహార లాంటి సంస్థలకు ప్రభుత్వం తన వంతు సహకారాన్ని అందిస్తూనే ఉందని, బుద్ధ విహార్ ధ్యాన మందిర నిర్మాణానికి రేవంత్ రెడ్డి రూ. 2.17 కోట్ల నిధులు కేటాయించిన విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో బౌద్ధ భిక్షువు హిత్తిక భంటేజీ, మహా బోధి సొసైటీ జనరల్ సెక్రటరీ ఆనంద్ భంటేజీ, మహాబోధి బుద్ధ విహార్ డైరెక్టర్ బుద్ధపాల భంటేజీ, బెంగళూర్ ఎంబీఎస్ సెక్రటరీ సుగతనంద భంటేజీ, మహాబోధి రిసర్చ్ సెంటర్ (బెంగళూర్) డైరెక్టర్ బుద్ధదత్త భంటేజీ, మహాబోధి బుద్ధ విహార్ చీఫ్ పాట్రన్ అంజనేయరెడ్డి, డా. శివనాగిరెడ్డి, బౌద్ధ ఉపాసిక, ఉపాసికలు పాల్గొన్నారు.



# సన్నరకం వడ్లకు రూ. 500ల బోనస్...

- కాంగ్రెస్ రైతు సంక్షేమ ప్రభుత్వం.
- చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తాం..
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**జనపదం, వేములవాడ :** కాంగ్రెస్ రైతు సంక్షేమ ప్రభుత్వమని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సన్న రకం వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఈ పంట నుండే ఇస్తుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. అది వారం వేములవాడ అర్బన్ మండలం అనుపురం, సంకేపల్లి గ్రామాల్లో, చందుర్తి మండలంలోని సనుగుల గ్రామంలో మూడపల్లి గ్రామంలో ఫ్యాక్స్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ 20 సంవత్సరాల క్రితం దళారీ వ్యవస్థకు స్వస్తి పలికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది వైఎస్ రాజశేఖర్ రెడ్డేనని గుర్తుచేశారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణను మహిళా సంఘాలకు, ఫ్యాక్స్, డీసీఎంఎస్ లకు అప్పజెప్పామన్నారు. క్షేత్ర స్థాయిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందన్నారు. రైతులకు సరిపడా టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. రైతులు 17 శాతం తేమ వచ్చాక ధాన్యం తూకం వేయడం జరుగుతుందదని తెలిపారు. ముంపు గ్రామాల సమస్యల పై గతంలో 3000 పైగా దరఖాస్తు లను గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు అని,ఇప్పుడు ప్రజా ప్రభుత్వం లో ఆ దరఖాస్తులను క్రోడీకరించి వాటికి త్వరలోనే శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఆనాడు పాదయాత్ర చేసి శ్రీ పాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వైయస్ రాజశేఖర్ రెడ్డి తీసుకువచ్చి రూ.1737 కోట్లు మంజూరు చేసారని తెలిపారు. మొన్నటి బడ్జెట్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషితో రూ.325 కోట్లు నిధులు మంజూరు చేయడం జరిగిందని పేర్కొన్నారు. రాజకీయంగా జన్మనిచ్చిన చందుర్తి మండలాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలు కోరుకునేదే చేస్తూ ముందుకు పోతున్నామని తెలిపారు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిత్య విద్యార్థిలాగా ప్రజలు అధికారులు చెప్పేది వింటూ నూతన పాలసీలను తయారు చేస్తున్నారని అన్నారు.

# కేబినెట్ నిర్ణయాలపై టీపీటీఎఫ్ తీవ్ర అసంతృప్తి

- జీవో 317 బాధితులందరికీ న్యాయం చేయాలి
- పెండింగ్ డీఏలను ప్రకటించాలని డిమాండ్

**జనపదం, సిద్దిపేట :** ఐదు వాయిదాల కరువు భత్యం(డీఏ) పెండింగ్ లో ఉండగా ప్రస్తుతం ఒక్క వాయిదాని మాత్రమే విడుదల చేయడం, జీవో 317 సమస్యలపై దాటవేత వైఖరిపట్ల ఉపాధ్యాయులమంతా తీవ్రంగా నిరసిస్తున్నామని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్ కుమార్ అన్నారు. ఆదివారం సిద్దిపేట్ జిల్లా జనరల్ కౌన్సిల్ కు ముఖ్య అతిథులుగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా అధికారంలోకి వచ్చిన పదిహేను రోజుల్లో బకాయి పడిన మూడు వాయిదాల డీఏ విడుదల చేస్తామని, పీఆర్సీ రిపోర్ట్ తెప్పించి వెంటనే ఆమోదయోగ్యమైన ఫిట్మెంట్ తో పిఆర్సీ ప్రకటిస్తామని, పెండింగ్ బిల్లులు విడుదల చేస్తామని, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్దరిస్తామని, జీవో 317 బాధితులందరికీ న్యాయం చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్నదన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని పదినెలలుగా ప్రభుత్వంపై ఒత్తిడి చేయకుండా ఓపిక పట్టామని, సగం మందికైనా నెల మొదటి తేదీన వేతనాలు ఇస్తున్నందుకు సంతోషించామన్నారు. భార్యాభర్తలు, ఆరోగ్య కారణాలతో బదిలీలకు జీవోలోనే అవకాశం ఉన్నదని, స్థానికత కోల్పోయిన వారి గురించి నిర్ణయం చేయకపోతే కమిటీ వల్ల ఉపయోగం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. సీపీఎస్ రద్దు గురించి ఊసే లేదని, రెండేళ్ళుగా వేలాది బిల్లులు క్లియర్ కావటం లేదన్నారు. కనీసం రెండు వాయిదాల డీఏ అయినా ఇప్పుడు ఇస్తారని ఉద్యోగులు ఆశగా ఎదురు చూస్తున్న సందర్భంలో కేవలం ఒక్క వాయిదా డీఏ మాత్రమే విడుదల చేయటంతో ఉద్యోగులు జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. ప్రభుత్వం పెట్టే ఖర్చులన్నీ పెడుతూనే ఉద్యోగులకు న్యాయంగా ఇవ్వాల్సిన డీఏలకే ఆర్థిక పరిస్థితి ఆటంకమౌతుందా అని టీపీటీఎఫ్ ప్రశ్నిస్తున్నదన్నారు. డీఏతో పాటు జీవో 317 సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునః సమీక్షించుకోవాలని, ఇతర సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించి సమస్యలన్నింటినీ కాలయాపన లేకుండా పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# దీపావళి కానుకగా ఇందిరమ్మ ఇండ్లు

- యడవెల్లి అభివృద్ధికి రూ. 13 కోట్లు కేటాయింపు
- ఉరుకుల పరుగులతో అభివృద్ధి చేసుకుందాం.
- పదేళ్లు మధిర అభివృద్ధికి నిధులు ఇవ్వని బీఆర్ఎస్ సర్కార్
- రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**జనపదం, ఖమ్మం :** కాంగ్రెస్ పార్టీ ఎన్ని కల్లో ఇచ్చిన హామీ మేరకు దీపావళి కానుకగా పేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం చేసుకోవడానికి ప్రజా ప్రభు త్వం ఐదు లక్షల రూపాయలు సాయం అందించబోతుందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. ఆదివారం రాత్రి ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం ముదిగొండ మండలం యడవల్లి గ్రామంలో 8 కోట్ల రూపాయలతో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ యడవల్లి లో కొలువై ఉన్న యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులతో మనందరికీ శుభం జరగాలని, ప్రతి కార్యక్రమాన్ని ఇక్కడి నుంచే తాను ప్రారంభిస్తానని చెప్పారు. నియోజకవర్గంలో చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయా త్ర, ఎన్నికల ప్రచారం ఈ దైవ సన్నిధి నుంచే ప్రారంభించడం దేవుడు ఆశీస్సు లు, మీ అందరి దీవెనలతో విజయం సా ధించానని వివరించారు. యడవెల్లి గ్రా మ అభివృద్ధికి ఇప్పటికి రూ.13 కోట్లు కేటాయించినట్లు వివరించారు. యో గానంద లక్ష్మీనరసింహస్వామి దేవాలయం అభివృద్ధి కోసం రూ.4.74 కోట్లు, యడవెల్లి గ్రామం నుంచి మాదాపూర్ కట్టలూరు గ్రామానికి రూ.8 కోట్ల రూపాయలతో బిటి రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. గత పది సంవత్సరాలు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడం వ ల్ల అనుకున్నంత అభివృద్ధి చేయలేకపోయమన్నారు. ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే మధిర నియోజకవర్గ అభివృద్ధికి పెద్ద ఎ త్తున నిధులు తీసుకువస్తున్నట్లు చెప్పా రు. మధిర శాసనసభ్యుడిగా గెలిపించ డం వల్ల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ఉన్న నేను ప్రభుత్వంలో కీలకంగా ఉండటంవల్ల నిధులు తీసుకురాగలుగుతున్నానని వివరించారు. ఈ ఐదేళ్లు ఒక నిమిషం కూడా వృథా చేయకుండా రాష్ట్రాన్ని, మన నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని చెప్పారు. ఒక నిమిషం వృథా చేసిన అభివృద్ధిలో వెనుకబడి పోతామన్న విషయాన్ని గ్రహించాలని భట్టి విజ్ఞప్తి చేశారు.

# ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణకు గొంతు విప్పాలి

**ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభలో వక్తలు**



**జనపదం, సిద్దిపేట :** ప్రొఫెసర్ సాయిబాబా ఆలోచనా విధానాన్ని ముందుకు తీసుకు వెళ్లి పౌర ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణకు ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు, రచయితలు గొంతు విప్పాలని వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఇటీవల మరణించిన సామాజిక ఉద్యమ నేత ప్రొఫెసర్ జీఎన్. సాయిబాబా సంస్మరణ సభను సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రొఫెసర్ సాయిబాబా తన జీవితాంతం ఆదివాసీల హక్కుల కోసం పోరాటం చేశాడని అన్నారు. దేశ సంపద, సహజ వనరులు కార్పొరేట్ శక్తులకు కాకుండా ఈ దేశ ము లవాసులకు, ఆదివాసులకు,పేద ప్రజలకు దక్కాలని తపన పడ్డాడని తెలిపారు. ప్రజల కోసం పోరాడుతున్న ప్రజా ఉద్యమాలపై అణిచివేత కు వ్యతిరేకంగా పోరాటం చేశాడని అన్నారు. గ్రీన్ హంట్, కగార్ యుద్దానికి వ్యతిరేకంగా ప్రజా స్వామిక వాదులను కూడగట్టి పోరాటం చేశాడని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఫాసిస్టు చర్యలకు వ్యతిరేకంగా సాయిబాబా గొంతు విప్పాడని అన్నారు. ప్రజాస్వామిక తెలంగాణ కోసం సాయిబాబా పోరాటం చేశాడని ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం లో కీలక పాత్ర నిర్వహించాడని అన్నారు. ఆయన చేసిన పో రాటాలు గిట్టని ప్రభుత్వాలు ఆయన పై కక్ష కట్టి ఉపా చట్టం కింద అరెస్ట్ చేసి జైల్లో పెట్టారని అ న్నారు. 90 శాతం అంగ వైకల్యం తో ఉన్న సా యిబాబా కు బెయిల్ రాకుండా అడ్డుకొని ఏ నేరం చేయకపోయినా పది సంవత్సరాలు జైలు లో ఉంచి ఆయన ఆరోగ్యాన్ని పూర్తిగా దెబ్బ తీసేలా చేసిందని అన్నారు. ఏడు నెలల క్రితం నిర్దోషి గా జైలు నుండి బయటకు వచ్చిన సాయిబాబా ఆరోగ్యం క్రమంగా క్షీణించి తీవ్రమైన అనారోగ్యం తో మృత్యువాత ప డ్డాడని అన్నారు. ఒక రకంగా సాయిబాబా ది ప్రభుత్వం చేసిన హత్య గా వక్తలు అభివర్ణించారు. ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ గా ఎంతో మంది విద్యార్థుల కు సాయిబాబా ఆదర్శం గా నిలిచాడని అన్నారు. తెలంగాణ పౌరహక్కుల సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు రాగుల భూపతి, తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర నాయకుడు జి. సత్తయ్య అధ్యక్ష్యతన జరిగిన సంస్మరణ సభలో తెలంగాణ పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణ రావు,సాయిబాబా కూతురు మంజీర, రచయిత దారం మల్లారెడ్డి, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు సంఘం, మంజీరా రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు కె. రంగాచారి, ప్రజా కళా మండలి రాష్ట్ర అధ్యక్షులు జాన్, ప్రజా నాట్య మండలి రాష్ట్ర నాయకుడు రాజ నర్సింహ, గోపాల స్వామి, మంద పవన్, చంద్రమౌళి, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

# కేసు నీరుగార్చే కుట్ర..

- ట్విట్టర్ టిల్లు బామ్మర్ది ఫాంహౌజ్ పార్టీకేసులో అన్నీ తారుమారు..
- కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే..
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్



**జనపదం, హైదరాబాద్ సిటీ:** రేవ్ పార్టీలో డ్రగ్స్ ఆనవాళ్లు లేవని పోలీసులతో చెప్పించేలా కాంగ్రెస్ పై బీఆర్ఎస్ ఒత్తిడి చేయిస్తోందని, లిక్కర్ పార్టీయే తప్ప రేవ్ పార్టీ కాదని బుకాయించేందుకు సిద్ధమయ్యారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. పంచనామాలోనే డ్రగ్స్ ఆనవాళ్లు లేకుండా కుట్ర చేశారని, విదేశీ మద్యం బాటిళ్ల పేర్లను మాత్రమే ప్రస్తావించినట్లు తెలిసిందన్నారు. ట్విట్టర్ టిల్లు, ఆయన కుటుంబ సభ్యులను తప్పించి ఈ కేసులో అనామకుల పేర్లను చేర్చే కుట్ర మొదలైందన్నారు. దాంతో బీఆర్ఎస్ పార్టీకి కాంగ్రెస్ ఇచ్చే దివాళీ గిఫ్ట్ ఇదే అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటే అని మరోసారి నిరూపితమైందని, రేవ్ పార్టీలో ట్విట్టర్ టిల్లు, ఆయన కుటుంబ సభ్యులు కూడా లేరని బుకాయించబోతున్నారన్నారు. ట్విట్టర్ టిల్లు కుటుంబ సభ్యులున్నట్లు ఫొటోల తోసహా టీవీల్లో వస్తున్నా ఆ దిశగా విచారణ ఎందుకు జరపడం లేదన్నారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, డ్రగ్స్, గొర్రెల స్కాం మాదిరిగానే 'రేవ్ పార్టీ' కేసును నీరుగారుస్తున్నారని, నిజంగా రేవంత్ సర్కార్ కు దమ్ముంటే రేవ్ పార్టీలో పాల్గొన్న 35 మంది పేర్లు బయటపెట్టాలన్నారు. సీసీ ఫుటేజీలు, టవర్ లోకేషన్స్ గుర్తింపు ఆధారాలను ప్రజల ముందుంచాలని, ట్విట్టర్ టిల్లు, ఆయన కుటుంబ సభ్యులను అరెస్ట్ చేయాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# ప్రభుత్వాన్ని బదనం చేయడం సరికాదు..

- దొంగలు దొరికారు.. బుకాయింపు వద్దు..
- మంత్రి పొన్నం ప్రభాకర్



జనపదం, హైదరాబాద్: దొరికిన దొంగలు మళ్ళీ సమర్థించుకునే విధంగా ప్రభుత్వాన్ని బదనం చేస్తున్నారని, తాగి దొరికిన కేసులో బుకాయించి మాట్లాడితే తప్పు ఒప్పేతదనుకుంటే పొరపాటని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వానికి అనేక ప్రజాహిత పనులు కార్యక్రమాలు ఉన్నాయని, నిన్న ఒకవైపు క్యాబినెట్ సమావేశం అనేక కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. పోలీసులు విధి నిర్వహణలో స్థానికుల ఫిర్యాదు మేరకు రైడ్ చేస్తే దొరికిన రాజకీయ పెద్దల బంధువులు అది ఒప్పు అన్నట్లుగా పోలీసులను విమర్శించే విధంగా జరుగుతుందన్నారు. విచారణ కొనసాగుతుంది. ప్రభుత్వం నుండి ఎలాంటి కక్ష సాధింపు ధోరణిలో పోలీసులు అక్కడికి వెళ్లి రైడ్ చేయలేదని, ముఖ్యమంత్రి మంత్రులు ప్రజాహిత కార్యక్రమాల్లో ఉన్నారన్నారు. కావాల్సికొని ఈ అంశాన్ని రాజకీయ చేయడానికి మాజీ మంత్రులు , శాసన సభ్యులు ప్రైవేట్ ఫంక్షన్ లో కూడా తాగినప్పుడు అనుమతి అవసరం అని తెలుసుకోవాలన్నారు. పోలీసులను ప్రతి ఫాం హౌస్ లో ఏం జరుగుతుందని క్షుణ్ణంగా చూడామని చెప్పలేదన్నారు. ఫిర్యాదు ద్వారా వచ్చిన అంశం మీద బీజేపీ హోంశాఖ సహాయ మంత్రి కుమ్మక్కై కేసును నిర్వీర్యం చేస్తున్నారని అంటే బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ,మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ఏం మాట్లాడరన్నారు. ఈ కేసు మీద పార్టీ స్టాండ్ ఏంటో కిషన్ రెడ్డి చెప్పాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకత్వాన్ని రక్షించ డానికి మాదకద్రవ్యాలు తీసుకోవడం మా జన్మహక్కు అనే విధంగా మాట్లాడడాన్ని సమాజం చూస్తుందన్నారు. పోలీసుల ఆత్మస్థైర్యం దెబ్బతీయద్దని హితువు పలికారు. రాజకీయ మిత్రులకు లొంగకుండా కేసు విచారణ చేయాలని పోలీసులను కోరారు.



# జన్వాడ ప్రకంపనలు...

## కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఫాం హౌస్ లో పార్టీ

- హాజరైన 35 మందిలో 14 మంది మహిళలు
- ఒకరు కొకైన్ తీసుకున్నట్టు నిర్ధారణ
- భారీగా విదేశీ మద్యం పట్టివేత..?
- ఎన్డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు
- పాల్గొన్న అందరూ హైప్రొఫైల్ కుటుంబాలకు చెందిన వారే
- స్పందించిన బీజేపీ, కాంగ్రెస్, ఎదురుతిరిగిన బీఆర్ఎస్
- ముగ్గురిపై కేసులు నమోదు
- రాజ్ సోదరుడు రాజేంద్రప్రసాద్ ఇంట్లో ఎక్సైజ్ పోలీసుల సోదాలు
- ప్రతిఘటించిన బీఆర్ఎస్ శ్రేణులు
- ప్రతిపక్ష ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే అరెస్ట్
- పరారీలో రాజ్ పాకాల



జనపదం, హైదరాబాద్ బ్యూరో: శనివారం అర్ధరాత్రి నగర శివారులో సంచలనం చోటు చేసుకున్నది. హైదరాబాద్ శివారులోని మోకిళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని జన్వాడలో ఉన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బావమరిది రాజ్ పాకాలకు చెందిన ఫాం హౌస్ లో రేవ్ పార్టీ భగ్నమైంది. భారీ శబ్దాలతో పార్టీ నిర్వహిస్తున్న నిర్వాహకులపై స్థానికులు డయల్ 100 కు ఫోన్ చేశారు. దీంతో రంగంలో దిగిన నార్సింగి పోలీసులు, సైబరాబాద్ ఎస్ వోటీ బృందాలు, ఎక్సైజ్ పోలీసులు ఫామ్‌హౌస్‌కి వెళ్లి తనిఖీలు చేశారు. అక్కడ హైఫై పార్టీ జరుగుతున్నట్టు గుర్తించారు. పార్టీలో మొత్తం 35 మందిని గుర్తించిన పోలీసులు వారిలో 14 మంది మహిళలున్నట్లు నిర్ధారించారు. పార్టీలో డ్రగ్స్ ఆనవాళ్లు కనిపించడంతో స్నిఫర్ డాగ్స్ కూడా రంగంలోకి దించి పూర్తి స్థాయిలో తనిఖీలు చేశారు. అందరికీ డ్రగ్ పరీక్షలు నిర్వహించిన పోలీసులు పార్టీకి హాజరైన విజయ్ మద్దూరి కొకైన్ తీసుకున్నట్లు నిర్ధారణకు వచ్చారు. దాంతో రాజ్‌పాకాలపై ఎన్ డీ పీఎస్, ఎక్సైజ్ యాక్ట్ ప్రకారం చేవెళ్ల పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. అలాగే పార్టీలో అనుమతి లేని విదేశీ మద్యం, గేమింగ్ కాయిన్స్, క్యాసినో మెటీరియల్ గుర్తించారు. 10 లీటర్ల అనుమతి లేని ఫారిన్ లిక్కర్, 10 ఇండియన్ మేడ్ లిక్కర్ బాటిల్స్ సీజ్ చేశారు. జన్వాడలో పార్టీకి ఎక్సైజ్ డిపార్ట్ మెంట్ నుంచి ఎలాంటి పర్మిషన్ లేదని పోలీసులు తెలిపారు.

### రాజకీయ రంగు..

పార్టీకి హాజరైన వారిలో ప్రముఖులు ఉన్న నేపథ్యంలో ఇప్పుడీ రేవ్ పార్టీ కేసు రాజకీయ అంశంగా మారింది. ఈ పార్టీకి హాజరైన వారందరి పేర్లు మీడియాకు వివరించాలంటూ బీజేపీ నాయకులు డిమాండ్ చేస్తుంటే కాంగ్రెస్ నేతలు సైతం ఈ పార్టీలో పాల్గొన్న వారిని ఎట్టి పరిస్థితుల్లోనే ఉపేక్షించబోమని చెప్పారు. మరోవైపు ఆ పార్టీపై లోతుగా దర్యాప్తు జరిపించాలంటూ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ అధికార ప్రతినిధి కల్వ సుజాత ఆదివారం సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### భారీగా విదేశీ మద్యం స్వాధీనం...?

మద్యం పార్టీలో మొత్తం 35 మంది పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించారు. పాల్గొన్న వారిలో 21 మంది పురుషులు, 14 మంది మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఫామ్హౌజ్ యజమాని రాజ్ పాకాలా కేటీఆర్ బావమరిదిగా గుర్తించారు. విజయ్ మద్దూరి అనే వ్యక్తి కొకైన్ తీసుకున్నట్లు పోలీసుల పరీక్షల్లో నిర్ధారణ అయింది. కొకైన్ తీసుకున్నట్లు పరీక్షలో తేలడంతో ఎన్డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ శాఖ నుంచి ఎలాంటి అనుమతి లేకుండా మద్యం పార్టీ చేశారని పోలీసులు గుర్తించారు. ఈ పార్టీలో విదేశీ మద్యం సహా, భారీగా మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఇదిలావుంటే రేవ్ పార్టీ జరిగిన ఫాం హౌస్ లో క్యాసినో పరికరాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు అక్కడ క్యాసినో నిర్వహించినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఫామ్ హౌస్ లో ప్లేయింగ్ కార్డ్స్, ప్లాస్టిక్ కైన్స్ సైతం స్వాధీనం చేసుకున్నారు.

### నార్కోటిక్, ఎక్సైజ్ కేసులు నమోదు..

రేవ్ పార్టీపై నార్కోటిక్ విభాగం పోలీసులు ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. ఫాం హౌజ్ యజమాని రాజ్ పాకాలను ఏ1గా, డ్రగ్స్ తీసుకున్న విజయ్ మద్దూరిను ఏ2గా చేర్చిన నార్కొటిక్ విభాగం వారిపై మోకిల పీఎస్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అలాగే క్షేత్రస్థాయిలో పార్టీ ఆనవాళ్లను పరిశీలించి.. విచారణ ప్రారంభించిన ఎక్సైజ్ పోలీసులు సైతం శాఖాపరంగా కేసులు నమోదు చేశారు. ఫామ్‌హౌస్ సూపర్‌వైజర్ కార్తిక్ పై ఏ1, రాజ్ పాకాలపై ఏ2 కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీలత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిర్వాహకులు నిబంధనలను ఉల్లంఘించి పార్టీ నిర్వహించినట్లు చెప్పారు. కర్ణాటక లిక్కర్‌తోపాటు విదేశీ మద్యం కూడా కూడా స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ఏడు లీటర్ల మద్యాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో ఇప్పటికే రాజ్ పాకాల పరారీలో ఉన్నారని, విచారణలో మరికొన్ని వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు. ఇదిలావుంటే.. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఫాం హౌస్ యజమాని రాజ్ పాకాల పరారీలో ఉన్నాడు. ఆయన కోసం పోలీసులు గాలిస్తున్నారు.

### 'ఓరియన్' వద్ద ఉద్రిక్తత..

రాయదుర్గంలో రాజ్‌పాకాల సోదరుడు రాజేంద్రప్రసాద్ కు చెందిన ఓరియన్ విల్లాస్ వద్ద ఆదివారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. జన్వాడ ఫాంహౌస్‌లో మద్యం పార్టీకి ఆతిథ్యం ఇచ్చినట్లు ప్రచారం జరుగుతన్న రాజ్‌పాకాల ఓరియన్ విల్లాలో ఉన్నట్లు సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు అందులో తనిఖీలు చేపట్టేందుకు అక్కడికి వెళ్లారు. అయితే ఆ విల్లాకు తాళం వేసి ఉండడంతో కాసేపు వేచి చూసిన పోలీసులు రాజ్ పాకాల మరో విల్లాలో ఉన్నారన్న సమాచారం మేరకు అక్కడికి వెళ్లారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకుని ఆందోళన చేశారు. పోలీసులు లోపలికి వెళ్లకుండా బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు అడ్డుకున్నారు.సెర్చ్ వారెంట్ లేకుండా ఎలా తనిఖీ చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పోలీసులు, బీఆర్ఎస్ నేతల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో బీఆర్ఎస్ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ సహా పలువురు నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం ఎక్సైజ్ అధికారులు ఆ విల్లాలో తనిఖీలు చేపట్టారు.

## ఎవరినీ వదిలిపెట్టం

### కాంగ్రెస్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్



జన్వాడలోని కేటీఆర్ బామ్మర్ది ఫామ్ హౌస్ లో జరిగిన డ్రగ్స్ పార్టీ పై లోతుగా విచారణ జరపాలని ప్రభుత్వాన్ని కోరినట్లు కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ అనిల్ యాదవ్ తెలిపారు. ఆదివారం గాంధీభవన్ లో మీడియాతో మాట్లాడిన ఆయన ఈ పార్టీ లో ఎంత పెద్ద వారు ఉన్న వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. అందరినీ కఠినంగా శిక్షిస్తామన్నారు. రాజ్ పాకాల తన స్వంత ఫామ్ హౌస్ లో డ్రగ్, విదేశీ మద్యం తో పార్టీ ఇచ్చిన విషయం తేటతెల్లమైందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని ఫ్రీ డ్రగ్స్ స్టేట్ గా చేయాలని అహర్నిశలు కృషి చేస్తుంటే.. మరోవైపు కేటీఆర్ అండ్ బ్యాచ్ రాష్ట్రాన్ని డ్రగ్స్ స్టేట్ గా మార్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

## సీసీ ఫుటేజ్ బయటపెట్టాలి

### బీజేపీ ఎంపీ రఘునందన్ రావు



మెదక్ ఎంపీ రఘునందన్ రావు సైతం డ్రగ్స్ పార్టీపై స్పందించారు. శని, ఆదివారాలు వచ్చాయంటే రేవ్ పార్టీలు అని విచ్చలవిడిగా డ్రగ్స్ దందా జరుగుతుందన్నారు. విదేశీ మాదక ద్రవ్యాలతో పాటు కొకైన్‌లు విచ్చల విడిగా తెచ్చి భాగ్య నగరంలో డ్రగ్స్ దందా చేస్తున్నారని వ్యాఖ్యానించారు. ఈ పార్టీలో వీఐపీల పిల్లలు ఉన్నారనే వార్తలు వినిపిస్తున్నాయన్నారు. వీఐపీల పిల్లలుంటే నేరం నేరం కాకుండా పోతుందా.. అని ప్రశ్నించిన ఆయన ఆధారాలుంటే ఎవరినైనా అరెస్టు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఫామ్‌హౌజ్ ఓనర్‌తో కుమ్మక్కు కాకపోతే డీజీపీ ఆ ఫామ్‌హౌజ్ చుట్టూ ఉన్న సీసీ ఫుటేజ్ తో పాటు ముఖ్యంగా ఫామ్‌హౌజ్‌లో ఎస్ఓటీ పోలీసులు రెయిడ్ చేసినప్పుడు ఫామ్‌హౌజ్ లోపల, బయట ఉన్న సీసీ ఫుటేజీని వెంటనే విడుదల చేయాలన్నారు. లేనిపక్షంలో సీసీఫుటేజీ ట్యాంపరింగ్ చేసే అవకాశం ఉందన్నారు. రేవంత్ రెడ్డి పొల్యూట్ కాకపోతే జన్వాడ ఫామ్‌హౌజ్‌లో శనివారం రాత్రి ఏం జరిగిందనేది ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. రెయిడ్ కు వెళ్లిన పోలీసులు కొంతమంది పెద్దలను అక్కడ్నుంచి పంపించినట్లు అనుమానాలు ఉన్నాయన్న రఘునందన్ రావు సీసీ ఫుటేజ్ ద్వారా నిజాలు వెల్లడవుతాయన్నారు. ఈ ఫామ్ హౌస్ డ్రగ్ పార్టీ వ్యవహారంపై సిట్ వేయాలని డిమాండ్ చేశారు. ఆ వ్యవహారంలో ఎంతటి వాళ్లు ఉన్నా కఠినంగా శిక్షించి సీఎం రేవంత్ రెడ్డి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు.

# ప్రభుత్వానిది దుష్ప్రచారం

- ఇంత దిగజారుడు సరికాదు...
- కక్షసాధింపునకు పరాకాష్ట..
- మాజీ మంత్రి హరీష్ రావు..
- రేవ్ పార్టీ ఎపిసోడ్ లో రేవంత్ సర్కార్ పై తీవ్ర ఆగ్రహం..
- రాజకీయాలు దిగజారొద్దని కాంగ్రెస్ కు హితవు..

జనపదం, హైదరాబాద్ బ్యూరో: మాజీ మంత్రి కేటీఆర్, కుటుంబ సభ్యులపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న దుష్ప్రచారాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. కేటీఆర్‌పై బురదజల్లడంలో భాగంగానే ఆయన బావమరిదిపై డ్రగ్స్ కేసంటూ రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని, ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు ఇది పరాకాష్టగా భావించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సమస్యలన్నింటి నుంచి, హామీల నెరవేర్చని తనం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఇంత దిగజారుడు చర్యలకు దిగుతున్నారన్నారు. జన్వాడ ఫాంహౌజ్‌లో డ్రగ్స్ పార్టీలు జరిగాయంటూ రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వేదికగా ప్రచారాలు చేయడం అత్యంత దౌర్భాగ్యం అన్నారు.

### తెలిసినా ఎందుకిలా..?

రాజ్ పాకాల నివాసంలో ఫ్యామిలీ ఫంక్షన్ ఉన్నదని ముందుగానే ప్రభుత్వ పెద్దలకు తెలుసని హరీష్ రావు అన్నారు. రెండు రోజుల నుంచి రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విభాగం శని, ఆదివారాల్లో బాంబులు పేలుతాయని అనడం, చెప్పినట్లుగానే ఇళ్లపై దాడులు చేయడం చూస్తే, ముందస్తు ప్రణాళికగా ఇది ప్రభుత్వం రూపొందించిన స్కెచ్ అని అర్థమవుతోందన్నారు. ఫ్యామిలీ ఫంక్షన్‌పై దాడిచేసి దాన్ని రేవ్ పార్టీగా చిత్రీకరించే ప్రయత్నం చేయడాన్ని అసలేమనాలో తెలియడం లేదన్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు, భార్యాభర్తలు ఉన్న ఫ్యామిలీ ఫంక్షన్‌ను డ్రగ్స్ పార్టీగా చిత్రీకరించే ప్రయత్నం మరెక్కడా జరగదేమో అని రేవంత్ సర్కార్ తీరును దుయ్యబట్టారు. కేటీఆర్ ఆయన సతీమణి ఆ ఫ్యామిలీ ఫంక్షన్‌కి వెళ్లకపోయినా వెళ్లినట్టు చిత్రీకరించడం హేయమైన చర్య అన్నారు. కేటీఆర్ వ్యక్తిత్వాన్ని, ఇమేజ్‌ను దెబ్బతీసే ప్రయత్నం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేయడం రాజకీయ కక్ష సాధింపు చర్య తప్ప మరేమీ కాదన్నారు. పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ప్రభుత్వ ఒత్తిళ్లకు లొంగవద్దని, నిజాయితీగా ఉన్నది ఉన్నట్టు చెప్పాలని, వ్యవస్థపై అపనమ్మకం కలిగేలా ప్రవర్తించవద్దని వేడుకుంటున్నానన్నారు.

ప్రభుత్వంపై ప్రజల్లో రోజురోజుకు పెరుగుతున్న వ్యతిరేకతను తగ్గించుకోవడానికి ఇలాంటి చౌకబారు పనులకు దిగడం సరికాదన్నారు. ఎన్ని డ్రామాలాడినా ప్రజలకు అంతా తెలుసని, ఎప్పుడు ఎలా బుద్ధి చెప్పాలో ఇప్పటికే నిర్ణయించుకున్నారని పేర్కొన్నారు. రాజకీయాల్లో నేరుగా ఎదుర్కోలేక కుటుంబ సభ్యులను అడ్డం పెట్టుకొని చీప్ పాలిటిక్స్ చేయడం ఇప్పటికైనా అంతా మానుకోవాలని హరీష్ రావు హితువు పలికారు. పర్సనల్ లైఫ్ ను కూడా పబ్లిక్ చేస్తూ ఒకరికొకరు దుమ్మెత్తిపోసుకునే సంస్కృతికి చరమగీతం పాడాల్సిన అవశ్యకత ఉందన్నారు.



# పోరాటం ఆపే ప్రసక్తే లేదు..

- ప్రజల కోసం ప్రాణాలైనా లెక్క చేయా..
- సమస్యలపై నిలదీస్తూనే ఉంటా..
- రాష్ట్రంలో ఏం జరుగుతోందో జనాలే చూస్తున్నారు..
- ఇంట్లో దావత్ చేసుకునుడు తప్పా..?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్..



జనపదం, హైదరాబాద్: ప్రాణం పోయినా పోరాటం ఆపేది లేదని, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. జన్వాడ హైడ్రామా లో ఆదివారం రోజంతా జరిగిన పరిణామాలపై ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా రేవంత్ సర్కార్ చీప్ ట్రిక్స్ కు భయపడేది లేదన్నారు. ప్రాణాలకు సైతం తెగించే ఉద్యమంలోకి అడుగుపెట్టామని, అంత పెద్ద ఘట్టాన్నే దాటుకుని వచ్చిన వారం.., ఇలాంటి ఉడుత ఊపులకు భయపడతామా.. అని ప్రశ్నించారు.

### కొత్తేమీ కాదు..

తెలంగాణ కోసం ఉద్యమంలోకి వచ్చిన రోజే చావుకి తెగించి వచ్చామని, కేసులు, ప్రభుత్వాల కుట్రలు తమకు కొత్తేమీ కాదని కేటీఆర్ అన్నారు. రేవంత్ అక్రమాలు, అవినీతి, వైఫల్యాలు ఎత్తి చూపినందుకే అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. ఎలాంటి చట్టవిరుద్ధ కార్యక్రమాలు లేకున్నా ప్రభుత్వ కుట్రతోనే తమపై దుష్ప్రచారం, రాజకీయ కుట్రలు చేస్తున్నారని, పదకొండు నెలలుగా రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని విరుచుకుపడ్డారు.

### రాజీ లేని పోరాటం..

ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలమవుతున్న రేవంత్ సర్కార్ ను చీల్చి చెండాడే యుద్ధంలో బీఆర్ఎస్ నేతలు రాజీ లేకుండా పోరాటం చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. ఉద్యమ నేత కేసీఆర్ నేర్పిన బాటలో బీఆర్ఎస్ నేతలు నడుస్తున్నారని, ఎక్కడా లైన్ తప్పిన దాఖలాలు లేవన్నారు. సివిల్ సప్లైస్ స్కాం, మూసీ స్కాం వంటి అన్ని రకాల రేవంత్ అక్రమాలు, అవినీతి, వైఫల్యాలు ఎత్తి చూపినందుకే అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. రాజకీయంగా ఎదుర్కోలేక కుట్రలు చేస్తున్నారని, చావుకు తెగించి ఉద్యమం చేసిన వాళ్లం రేవంత్ రెడ్డి కుట్రలకు భయపడతామా.. అన్నారు.

### దావత్ తప్పా..?

శనివారం నుంచి ప్రహసనంగా తమపై రేవంత్ సర్కార్ కుట్ర నడిపే ప్రయత్నం చేస్తున్నదని కేటీఆర్ అన్నారు. దీపావళి పండుగకు ఇంట్లో కుటుంబమంతా కలిసి దావత్ చేసుకునుడు కూడా తప్పేనా.. అన్నారు. దాని కోసం కూడా అనుమతులు తీసుకోవాలా.. చెప్పాలన్నారు. రాజ్ పాకాల ఇల్లు కట్టుకొని గృహప్రవేశం చేశాడు, దాని కోసం అయన కుటుంబ సభ్యులు, మిత్రులతో ఫ్యామిలీ ఫంక్షన్ చేసుకున్నారు., అలాంటి కుటుంబ కార్యక్రమాన్ని రేవ్ పార్టీ అంటూ కొంత మంది పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు. తాను అక్కడ లేకున్నా తన పేరుతో అడ్డగోలుగా వార్తలు ప్రచారం చేస్తున్నారని, ప్రజా జీవితంలో ఉంటే తమపై ఏలాంటి మాటలైనా, అడ్డగోలు ప్రచారమైనా చేయొచ్చా అని కేటీఆర్ ప్రశ్నించారు.

### ఎందుకీ దుష్ప్రచారం..

21 గంటలు పరిశోధించి పట్టుకున్నది ఏంటని కేటీఆర్ ప్రశ్నించారు. అక్కడ ఏం లేదని, ఎలాంటి డ్రగ్స్ దొరకలేదని అధికారులే స్పష్టంగా చెప్పారని అయినా ఇంతటి దుష్ప్రచారం ఎందుకో రాష్ట్ర ప్రజలు చూస్తున్నారన్నారు. కేసు అధికంగా మద్యం ఉన్న కేసు అని అబ్కారీ కేసు అని చేప్తే మళ్లీ నార్కోటిక్ కేసు అంటున్నారన్నారు. కేవలం పైవారి అదేశాల మేరకు మాత్రమే నార్కోటిక్ కేసు అంటున్నారు తప్ప మరేమి లేదన్నారు. పార్టీలోకి చేరి అనేక మందికి టెస్టులు చేస్తే రాజ్ పాకాలకు టెస్ట్ చేస్తే నెగిటివ్ వచ్చింది, అయినా అయనను బీజేపీ, కాంగ్రెస్ నాయకులు అడ్డగోలుగా మాట్లాడుతున్నారన్నారు.

### తేడా ఎందుకొచ్చింది..

ఈ ఇష్యూపై ఎన్డీపీఎస్ కేసు ఎలా పెడతారని కేటీఆర్ నిలదీశారు. ఉదయం ఇచ్చిన పంచనామాకి, ఎఫ్ఐఆర్‌కి తేడా ఏలా వచ్చిందో కూడా చెప్పాలన్నారు. బాంబులు అని చెప్పి కొండను తవ్వ ఎలుకను కూడా పట్టలేదని, ఎన్ని రకాలుగా ఇబ్బందులు పెట్టినా పోరాటాన్ని ఆపేది లేదని, రేవంత్ రెడ్డి వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామన్నారు. ఇచ్చిన హామీల నెరవేర్చకపోవడం, ప్రజలను మోసం చేయడం., వంటి అన్న అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కాంగ్రెస్ వెంటపడుతామని కేటీఆర్ హెచ్చరించారు.

# బీఆర్ఎస్ నేతల అరెస్ట్..

- ఓరియన్ విల్లాస్ వద్ద ఉద్రిక్తత
- రాజ్ పాకాల నివాసంలోకి వెళ్లేందుకు పోలీసుల యత్నం
- అడ్డుకునే ప్రయత్నం చేసిన గులాబీ దళం..
- బలవంతంగా స్టేషన్ కు తరలించిన పోలీసులు..

జనపదం, హైదరాబాద్ సిటీ: నగరంలోని ఓరియన్ విల్లాస్ వద్ద ఆదివారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రాజ్ పాకాల విల్లాలో విదేశీ మద్యం ఉందనే అనుమానంతో పోలీసులు దాడి చేసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో రాజ్ పాకాల విల్లాకు తాళం వేసి ఉండటంతో.. అతడి సోదరుడు శైలేంద్ర పాకాల నివాసంలో ఎక్సైజ్ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. అయితే పోలీసులను లోనికి వెళ్లకుండా బీఆర్ఎస్ నేతలు తీవ్ర స్థాయిలో అడ్డుకునే ప్రయత్నం చేయడంతో విల్లా దగ్గర కొద్దిసేపు హైడ్రామా నెలకొంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేతలతో పోలీసులు వాగ్వాదానికి దిగారు. దీంతో కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ సహా పలువురిని స్పెషల్ పార్టీ పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ వారెంట్ లేకుండా ఎలా సోదాలు చేస్తారంటూ ఎక్సైజ్ అధికారులను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్యకర్తలు ప్రశ్నించగా.. న్యాయవాది సమక్షంలోనే తనిఖీలు చేస్తున్నామని ఎక్సైజ్ పోలీసులు స్పష్టం చేశారు. ఇక విధులకు అటంకం కలిగించొద్దని పోలీసులు నచ్చజెప్పినప్పటికీ బీఆర్ఎస్ శ్రేణులు వెనక్కి తగ్గకపోవడంతో ముందస్తు చర్యల్లో భాగంగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

# కొండంత రాగం తీసి...

(మొదటిపేజీ తరువాయి) జరిగిన ఘటనలు చూస్తే తెలిసిపోతున్నది. కేవలం ఒక వ్యక్తిని, ఆ వ్యక్తి వెనకాల ఉన్న పార్టీని ఢీకొట్టే సత్తా లేకనే ఇంత నీచానికి దిగజారిన తీరు బాధాకరం. సమస్యను సమస్యగా చూడాల్సిన తీరును మాని, కేవలం చిన్న సమస్యనైనా తనకు బదులుకు పనికొచ్చే అవకాశంగా భావించిన కుట్ర అత్యంత విషాదకరం. జన్వాడలోని రాజ్ పాకాల ఇంట్లోనే తన అనుకున్నవారితో చేసుకుంటున్న పార్టీని వక్రీకరించి బదునాం చేసేందుకు హస్తం సర్కార్ పడిన శ్రమ సాయంత్రానికి బూడిదలో పోసిన పన్నీరుగా మారింది. ఇంట్లో పర్సనల్ గా జరుపుకునే దావత్ ను పబ్లిసిటీ చేసి అబాసుపాలైంది. అంతా ఒక్కదగ్గర చేరి జరుపుకుంటున్న ఆనంద సమయాన్ని చూడలేక కళ్లుకుట్టి చెరిచిన తీరు విమర్శకులను సైతం విస్మయానికి గురి చేసింది.

### రోజంతా పోలీసుల హంగామా...

పోలీసులు జన్వాడ ఫామ్ హౌజ్ వద్ద నానా హంగామా క్రియేట్ చేశారు. శనివారం రాత్రి పలువురు స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుతో రంగంలోకి దిగిన రక్షకభటులు ఆదివారం ఉదయం నుంచి తమ పని వేగాన్ని పెంచారు. ఘడియఘడియకు ఓ కొత్త క్లూన్ బయటకు వదులుతున్నట్టుగా నటిస్తూ మీడియా సాక్షిగా ఎన్నో అనుమానాలకు బీజం చేశారు. ప్రతిపక్షనేత, అందునా అధికారంలో ఉన్నప్పుడు వారి ద్వారా పొందిన పలు పరాభవాలకు ఇన్నాళ్లకు గట్టిగా తిప్పికొట్టే సమయం చిక్కిందని భావించి పలువురు అధికారులు జన్వాడ ఫామ్ హౌస్ లో ఏదో జరుగుతున్నది అని విషయాన్ని విరిచుకుంటూ చెప్పిన సందర్భాలు వారి అతిని తెలియజేస్తున్నాయి. అదీకాకుండా ఉదయం ఎక్సైజ్ కేసుగా నమోదైన క్రైమ్ సాయంత్రానికి డ్రాగ్స్ కేసుగా మారడం కూడా కొందరు ఉన్నతాధికారుల 'ప్రత్యేక' ఇంట్రెస్ట్ గా భావించాల్సి ఉంటుందని బీఆర్ఎస్ నేతలు చెప్పిన విషయం కూడా వారి ద్వంద్వ విధానాలను కళ్లకు కట్టింది.

### అత్యుత్సాహం ప్రదర్శించిన మీడియా..

శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు జన్వాడ రాజ్ పాకాల ఫామ్ హౌస్ వేదికగా పోలీసులు జరిపిన హంగామా ఒక రకంగా నవ్వు తెప్పించింది. బ్రేకింగ్ లు., టీఆర్పీ రేటింగ్ ల కోసం పలు మీడియా సంస్థలు పడరాని పాట్లు పడ్డాయి. కోతికి కొబ్బరి చిప్ప దొరికితే ఎలా చేస్తుందో అంతకు మించిన వికృత ఆనందంతో పోటీపడి, రుచి వంటను వండి వడ్డిస్తూ జనాలను అనుమానం అనే మీమాంసలో రోజంతా ఉక్కిరి బిక్కిరి చేశాయి. లోపలి నుంచి ఒక్క చిన్న మాట బయటకు పొక్కితే దానికి పదిరెట్ల మసాలాలు దట్టించి సగటు టీవీ వీక్షకుడు ఐతారం వేళ వదిలి వెళ్లకుండా బంధించి కూర్చునేలా చేశాయి. సాయంత్రానికి పోలీసులే జరిగింది ఇది.., పొద్దటి నుంచి మీరు, మేం చేసింది., చూపిందంతా ట్రాష్ అనే ధోరణిలో విడుదల చేసిన ఫైనల్ స్టేట్ మెంట్ తో రోజంతా మీడియా అతి దూకుడు ఎంత చిల్లరగా జరిగిందో చెప్పకనే చెప్పింది. మొత్తంగా కేటీఆర్ అంటే ద్వేషంతో ఉన్న రేవంత్ సర్కార్ ప్రతికారేచ్ఛతో రగిలిపోతూ అవకాశం చిక్కితే చాలు అన్నీ విప్పి నిలబెట్టాలనే కసితో ఉందని మరోమారు నిరూపించుకుంది. అదే సమయంలో తాను చేసిన అతితో అందరిలో నవ్వులపాలైంది అని కూడా రూఢీ చేసుకుంది.

Printed and Published Mallika. On behalf of Sri Krishna Vande Jagadgurum Publications, Published at Banjara Hills Road , Erramazill 6-3-562-14, Hyderabad - Telangana 500082.
Printing at Colour Graphics, 2-6-652/12, Amberpet Musarambagh Road ,Hyderabad, 500013 Telangana. Editor Sramik (Responsible for selection of News under the PRB act )
Reg no APTEL / 2012/46581, Phone Number 9849290606, Email ID : janapadham0606@gmail.com